




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :166 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 18 ఫిబ్రవరి 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :166 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 18 FEBRUARY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# దేశానికి సరైన సమయంలో సరైన నేత ప్రధానిగా ఉన్నారు

## తిరుపతిలో అంతర్జాతీయ దేవాలయాల సదస్సును ప్రారంభించిన సీఎం చంద్రబాబు

## సంస్కృతి, వారసత్వ పరిరక్షణలో దేవాలయాలదే ప్రధాన పాత్ర: చంద్రబాబు

- మూడ్రోజుల పాటు అంతర్జాతీయ దేవాలయాల సదస్సు
- తిరుపతిలో ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో
- టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో మనం చాలా ముందున్నామని వ్యాఖ్యలు
- 58 దేశాల నుంచి ప్రతినిధుల రాక
- ముఖ్య అతిథులుగా ఏపీ సీఎం చంద్రబాబు, మహా సీఎం ఫడ్నవీస్, గోవా సీఎం సావంత్



పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో అంతర్జాతీయ దేవాలయాల సదస్సు (ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో)ను ప్రారంభించిన అనంతరం సీఎం చంద్రబాబు ప్రసంగించారు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు ప్రధానమంత్రిగా ఉన్నారని చంద్రబాబు కొనియాడారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో మనం చాలా ముందున్నామని, దేశంలో యువత ఎక్కువగా ఉండడం మనకు మరో అదృష్టమని అన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో ఒకటి లేదా రెండో స్థానానికి ఎదగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. టెక్నాలజీ సా యంతో ఆలయాల్లో కార్యక్రమాలు సులభతరం అవుతు న్నాయని అన్నారు. దేవుడి పేరిట సమాజానికి సేవ చేసేందుకు ఎంతో మంది ముందుకు వస్తున్నారని తెలిపారు. దేవుడికి సేవ చేయడం అన్నిటి కంటే ఎంతో గొప్పది అని పేర్కొన్నారు. తిరుమల బాలాజీ అంటే కోట్ల మంది భక్తులకు నమ్మకం, ప్రగాఢ విశ్వాసం అని వివరించారు. ఏపీలోని దేవాలయాల్లో మౌలిక వసతులు పెంచామని వెల్లడించారు. ఏడు నెలల్లోనే దేవాలయా లకు రూ.134 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. రాష్ట్రంలోని అర్చకులకు వేతనాలు, వేద పాఠశాలలకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రముఖ ఆలయాలకు కమిటీలు ఏర్పాటు చేసి కార్యక్రమాల నిర్వహణ చేపడుతున్నామని వివరించారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కా దు... ప్రధాన ఆదాయ వనరులు కూడా అని అభిప్రా యపడ్డారు. దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రస్తుతం కాలంలో అందరూ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. ఎందరో భక్తులు రూ.కోట్లలో విరాళాలు ఇస్తున్నారని వెల్లడించారు. విరాళాలను విద్య, వైద్యం, ఇతర సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నా మని తెలిపారు. ఏపీలోని దేవాలయాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, దేవాలయాల్లో పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని

వివరాలు 2లో..

## కేసీఆర్ కు దేవుడు పరిపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలి



- కేసీఆర్ పుట్టినరోజు
- శుభాకాంక్షలు తెలుపుతున్న రాజకీయ ప్రముఖులు
- కేసీఆర్ కు భగవంతుడు పరిపూర్ణ జీవితాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించిన జగన్

పెన్ పవర్ డెస్క్:బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు. ఆయన 71వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు రాజకీయ నాయకులు బర్త్ డే గ్రీటింగ్స్ తెలిపారు.

వివరాలు 2లో..

## ఢిల్లీలో ప్రభుత్వాన్ని నడిపే సామర్థ్యం గల నేతలు బీజేపీలో లేరు




- బీజేపీ నుండి గెలిచిన ఎమ్మెల్యేల్లో ఎవరికీ పాలనా సామర్థ్యం లేదని చురక
- 48 మందిలో ఒక్కరిపై కూడా మోదీకి విశ్వాసం లేదన్న అతిషి
- ప్రభుత్వాన్ని నడిపే సత్తా లేనివారు ప్రజల అభివృద్ధి కోసం ఎలా పని చేస్తారని ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి పదవిని చేపట్టి ప్రభుత్వాన్ని నడిపే సామర్థ్యం గల నేతలు ఎవరూ లేనందునే బీజేపీ ఇంకా అభ్యర్థిని ప్రకటించడం లేదని మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత అతిషి ఎద్దేవా చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దాదాపు పది రోజుల క్రితం వెలువడ్డాయి. విజయం సాధించిన బీజేపీ... సీఎం అభ్యర్థిని మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. ఈ నేపథ్యంలో అతిషి స్పందించా రు.ఎన్నికల్లో గెలుపొందిన 48 మంది బీజేపీ ఎమ్మెల్యేల్లో ఒక్కరిపై కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విశ్వాసం

వివరాలు 2లో..

## కుంభమేళాలో బ్రాహ్మణులకు వస్త్రదానం చేసిన మంత్రి లోకేశ్ దంపతులు



- యూపీలోని ప్రయాగరాజ్ లో మహా కుంభమేళా
- కుటుంబ సమేతంగా తరలి వెళ్లిన ఏపీ మంత్రి నారా లోకేశ్
- త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించిన వైనం

పెన్ పవర్ డెస్క్:ప్రయాగరాజ్ మహా కుంభమేళాలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు బ్రాహ్మణులకు వస్త్రదానం చేశారు. పూర్వీకులకు మోక్షమార్గాన్ని ప్రసాదించాలం టూ గంగాదేవిని ప్రార్థించారు. కుంభమేళా ప్రాంగణంలో ప్రతిధ్వనించే కీర్తనలు, నదీ సంగమం వద్ద పవిత్ర పూజల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో లోకేశ్ దంపతులు మమేకమయ్యారు.

వివరాలు 2లో..

## మహా కుంభమేళాలో పాల్గొనడం జీవితకాలపు అనుభూతి

- ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగరాజ్ లో మహా కుంభమేళా-2025
- కుటుంబంతో సహా పాల్గొన్న ఏపీ మంత్రి నారా లోకేశ్
- ఫొటోలను పంచుకున్న నారా బ్రాహ్మణి



వివరాలు 2లో..

## పోలీసుల ఎదుట లొంగిపోయిన గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి నిందితులు

- 2023లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి
- 88 మందిని నిందితులుగా పేర్కొన్న పోలీసులు
- తాజాగా జానీ, కలామ్ అనే ఇద్దరు నిందితుల లొంగుబాటు
- ఈ కేసులో ఏ71గా ఉన్న వల్లభనేని వంశీ ఇటీవలే అరెస్ట్



పెన్ పవర్ డెస్క్:గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో పోలీసుల ద ర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రమంలో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా ఈ కేసులో ఇద్దరు నిందితులు లొంగిపోయారు. టీడీపీ ఆఫీసుపైదా డికేసులో మొత్తం 88 మంది నిందితులు ఉండగా, వారిలో జానీ, కలామ్ అనే వ్యక్తులు ఇవాళ గన్నవరం పోలీసులు ఎదుట లొంగిపోయారు. గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి ఘటన

వివరాలు 2లో..

## నందిగం సురేశ్ కు సత్తెనపల్లి కోర్టులో భారీ ఊరట



- అమరావతి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న కేసు
- ముందస్తు బెయిల్ కోసం సత్తెనపల్లి సివిల్ కోర్టును ఆశ్రయించిన సురేశ్
- ముందస్తు బెయిల్ మంజూరు చేసిన కోర్టు

పెన్ పవర్ డెస్క్:వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ కు సత్తెనపల్లి సివిల్ కోర్టులో ఊరట లభించింది. అమరావతి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న కేసులో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అమరావతి ఉద్యమం కొనసాగుతున్న సమయంలో అమరావతి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ 2020 ఫిబ్రవరిలో కేసు నమోదయింది. అమరావతికి చెందిన మహాలక్ష్మి అనే మహిళ ఫిర్యాదు మేరకు నందిగం సురేశ్,

వివరాలు 2లో..

## ఎవరినీ తొలగించం...

### గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త



- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘాలతో మంత్రి డీవీబీ స్వామి సమావేశం
- ఉద్యోగుల హేతుబద్ధీకరణపై చర్చలు
- ఏ, బీ, సీ కేటగిరీలుగా హేతుబద్ధీకరణ చేస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఏపీ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి నేడు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘాలతో సమావేశం అయ్యారు. సర్వీసు హేతుబద్ధీకరణపై ఉద్యోగుల సంఘాల నేతలతో

వివరాలు 2లో..

## శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

- ఈ నెల 26న మహా శివరాత్రి
- శ్రీశైలంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు బ్రహ్మోత్సవాలు
- సీఎం చంద్రబాబుకు ఆహ్వానపత్రిక అందించిన శ్రీశైలం ఆలయ ఈవో



పెన్ పవర్ డెస్క్:ఈ నెల 26న మహా శివ రాత్రిని పురస్కరించుకుని సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీశైలం లో బ్రహ్మోత్సవాలు నిర్వహి స్తున్నారు. తాజాగా, శ్రీశైలం మల్లన్న బ్రహ్మోత్సవాలకు రావాలంటూ

వివరాలు 2లో..

## వల్లభనేని వంశీ కేసులో కీలక పరిణామం

- వంశీని కస్టడీకి కోరుతూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో పోలీసుల పిటిషన్
- కోర్టులో బెయిల్ పిటిషన్ వేసిన వల్లభనేని వంశీ
- ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేసిన కోర్టు



పెన్ పవర్ డెస్క్:సత్యవర్ధన్ అనే దళిత వ్యక్తిని కిడ్నాప్ చేశారంటూ వైసీపీ నేత వల్లభనేని వంశీని అరెస్ట్ చేసిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రస్తుతం జైల్లో రిమాండ్ లో ఉన్న వల్లభనేని వంశీని 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని పోలీసులు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేశారు. ఇదే సమయంలో వంశీ

వివరాలు 2లో..

## ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం




పెన్ పవర్ డెస్క్: బీజేపీ వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆలస్యమైందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం (ఫిబ్రవరి 17) మంత్రి జూపల్లి నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ పోటీ చేయడం లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదరిందని.. ఇందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టలేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బీసీ కుల గణనను విమర్శించే నైతిక హక్కు బీజేపీ, బీఆర్ఎస్ కు లేదని అన్నారు.

వివరాలు 2లో..

## కుంభమేళాలో కొనసాగుతున్న భక్తుల తాకిడి... 52 కోట్ల మంది పుణ్య స్నానాలు

- ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహాకుంభమేళాకు రికార్డుస్థాయిలో భక్తులు
- జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా
- ఈ నెల 26 వరకు కొనసాగనున్న ఆధ్యాత్మిక కార్యక్రమం



పెన్ పవర్ డెస్క్:యూపీలోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు. కోట్లాదిగా త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఈ క్రమంలో కుంభమేళా ప్రారంభమైన గత నెల 13వ తేదీ నుంచి ఇప్పటి వరకూ రికార్డు స్థాయిలో

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కమలంలో పీక్స్ కు చేరిన అంతర్గత పోరు...

తెలంగాణ బీజేపీలో మళ్లీ రచ్చ మొదలైందంటూ వార్తలు గుప్పుమంటున్నాయి. పార్టీలో సంస్థాగతంగా ఎన్నికలు నిర్వహించుకుంటున్న నేపథ్యంలో జిల్లా అధ్యక్షుల నియామకంపై విమర్శలు?పీక్ స్టేజ్‌కు చేరుకున్నాయి. మొదటి విడతలో 19 జిల్లాలకు అధ్యక్షులను నియమించిన కాషాయ పార్టీ? రెండో విడతలో నలుగురు పేర్లు ప్రకటించింది. దీంతో అధ్యక్షుల సంఖ్య 23కి చేరింది. మిగిలిన జిల్లాల్లో అధ్యక్ష ఎంపికను పెండింగ్‌లో పెట్టి ఊరిస్తూ వస్తోంది. అయితే అధ్యక్షుల ప్రకటనలో ఊరిస్తోందా.. లేక అనుకున్న వారికి ఇచ్చేందుకు యత్నాలా అనే వార్తలు గుప్పుమంటున్నాయి. తాజాగా ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలతో? ఆ వాదనలకు ఆజ్యం పోసినట్లు అయ్యిందనే కామెంట్స్ జోరుగా వినిపిస్తున్నాయిమహిళలకే పెద్దపీట వేస్తామంటూ ప్రేమ ఒలకబోసిన కమలం పార్టీ..ఇప్పటి వరకూ ప్రకటించిన 23 జిల్లాల అధ్యక్షుల్లో కేవలం ఒక్క మహిళకే అవకాశం ఇచ్చి..విమర్శలపాలవుతోంది. సంగారెడ్డి జిల్లా మినహాయిస్తే? హేమా హేమీలున్న జిల్లాలోనూ మహిళలకు.. ఒక్కరంటే.. ఒక్కరికీ కూడా అవకాశం ఇవ్వకపోవడంతో మహిళా నేతల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందట. అంతేకాదు? పార్టీలో పనిచేసే వారికి కాకుండా? ఇతరులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు కూడా ముందు నుంచే వినిపిస్తున్నాయి.సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని భారతీయ జనతా పార్టీ చెబుతోంది. గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నామని చెప్పుకుంటోంది. అందుకు భిన్నంగా నేతల తీరు కనిపిస్తోందని సొంత పార్టీలో చర్చ జరుగుతోందట. ఇప్పటికే.. బూత్, మండల స్థాయిలో కమిటీలను సైతం ఏర్పాటు చేశామని.. అందులో భాగంగానే ఆయా జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తున్నామని రాష్ట్రనాయకత్వం చెబుతున్న మాట. ఇప్పటికే 19 జిల్లాలకు అధ్యక్షులను నియమించామని చెబుతున్న కాషాయ పార్టీ.. చెబుతున్న లెక్కలకు.. చేసే పనులకు పొంతన లేకుండా వ్యవహరిస్తోందని.. సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారట. తాజాగా మరో నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించడంతో మళ్లీ రచ్చ మొదలైందని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. పార్టీలో ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్న రాజాసింగ్ వంతు వచ్చింది. ప్రకటించిన నాలుగు జిల్లాల్లో గోల్కొండ జిల్లాకు సంబంధించిన అధ్యక్షుడు నియామకం అంశంలో.. ఆయన రాష్ట్ర బీజేపీ నాయకత్వాన్ని ఎడాపెడా ఉతికి ఆరేశారట. ఎంఐఎం, బీఆర్ ఎస్ తో కుమ్మక్కై తిరిగిన.. ఉమా మహేంద్రకు? అధ్యక్ష పదవి ఎలా కట్టబెడతారంటూ మండిపడ్డారట. ఇప్పటికే అధ్యక్షులను ప్రకటించిన జిల్లాల్లో? మెజారిటీ జిల్లాల్లో అసంతృప్తి?. పీక్ స్టేజీలో ఉన్న నేపథ్యంలో రాజాసింగ్ చేసిన కామెంట్స్.. హాట్‌గా మారాయనే వార్తలు గుప్పుమంటున్నాయి. అసలే.. ఎంపిక విషయంలో ఇబ్బందుల్లో ఉన్న అధిష్టానానికి? రాజాసింగ్ లాంటి వ్యక్తి ప్రశ్నలతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందంటూ ప్రచారం సాగుతోంది.తెలంగాణ బీజేపీ అంటే అందరికీ ఠక్కున గుర్తొచ్చేది ఎమ్మెల్యే రాజాసింగ్ పేరు. ఆ పార్టీలో ఆయన ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. ప్రత్యర్థులను తనదైన శైలిలో ఇరకాటంలో పెట్టే వ్యక్తిగా రాజాసింగ్‌కు ఫాలోయింగ్ కూడా ఉంది. అలాంటి వ్యక్తి.. సొంతపార్టీపై చేసిన హాట్ కామెంట్స్.. రాష్ట్ర నాయకత్వానికి కొరకరాని కొయ్యగా మారాయనే టాక్ నడుస్తోంది. రాజాసింగ్ అంటే..ఒక మతానికి ఫైర్ బ్రాండ్‌గా చెబుతుంటారు. బీజేపీకి సంబంధించిన హిందువులు? ఆయన్ను అమితంగా ఇష్టపడుతారు. అలాంటి నేతకు.. ఇప్పుడు పార్టీలో ఆదరణ కరువైందనే వార్తలు గుప్పుమంటున్నాయి. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడ కూడా రాజాసింగ్ కనిపించకపోవటంతో? వస్తున్న వార్తలకు మరింత బలం చేకూరునట్లు అవుతోంది.ఇక్కడే.. అసలైన ట్విస్ట్ ఉంది. నిజంగానే పార్టీ నేతలు? రాజాసింగ్‌ను దూరం పెడుతున్నారా.. లేక పార్టీ వ్యవహారాలు నచ్చక ఆయనే దూరంగా ఉంటున్నారా అనే చర్చ జోరుగా సాగుతోంది. ఉన్న ఫలంగా మరోసారి.. రాజాసింగ్ సొంత పార్టీపై సంచలనమైన వ్యాఖ్యలు చేయడంతో? ఆ పార్టీలో సంస్థాగతంగా ఏం జరుగుతోందో తెలియని గందరగోళ పరిస్థితుల్లోకి పార్టీ శ్రేణులు వెళ్లారనే టాక్ బలంగా వినిపిస్తోందిజిల్లాల అధ్యక్షుల నియామక అంశంలో? ఎంపీలు, ఎమ్మెల్యేలు.. వారి వారి నియోజకవర్గాలలో కొందరి పేర్లు ప్రతిపాదిస్తూ వారికే అధ్యక్ష పదవులు ఇవ్వాలని అధిష్టానానికి సూచనలు చేశారట. అందులో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా తన నియోజకవర్గంలోని గోల్కొండ జిల్లాకు ఎస్సీ లేదా బీసీ నేతని జిల్లా అధ్యక్షుడుగా నియమించాలని అధిష్టానానికి సూచనలు చేసినట్టుగా తెలుస్తోంది. కానీ.. ఎంఐఎం, బీఆర్ఎస్ తో తిరిగిన ఉమా మహేందర్‌క అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారట. అంతేకాదు.. రెండు రోజులు పార్టీ నాయకత్వానికి డెడ్ లైన్ కూడా ఇచ్చారనే ప్రచారం సాగుతోంది. ఈలోగా అధ్యక్షుడి అంశంలో పార్టీ నిర్ణయం మార్చుకోకపోతే .. తామేంటో చూపిస్తామంటూ హెచ్చరికలు కూడా జారీ చేశారట.గోల్కొండ జిల్లా అధ్యక్షుడి ఎంపికపై రాజాసింగ్ ఆడియో రిలీజ్ చేశారు. అందులో.. తనపై ఎంత కుట్ర కోణం దాగి ఉందో తెలుస్తుందంటూ హాట్ కామెంట్స్ చేశారు. అధిష్టానానికి మాతో పని లేధని అనుకుంటున్నారా..? మాతో అవసరం లేదని అనుకుంటున్నారా.. అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసేశారు. హిందూ ధర్మాన్ని ఆచరించడం నేర్చుకున్నాను తప్ప? కొంతమంది చేస్తున్నట్టుగా బ్రోకరిజాన్ని నేర్చుకోలేదనంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. హిందూ ధర్మం కాని బ్రోకరిజం వల్లే?? తెలంగాణలో ఎప్పుడో అధికారంలోకి రావాల్సిన పార్టీ వెనుకబడిపోయిందనేది రాజాసింగ్ వాదనగా తెలుస్తోంది. కొంతమంది ఉన్నంతకాలం.. తెలంగాణలో అధికారంలోకి రావడం కష్టమేనంటూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు రాజాసింగ్. అవసరమైతే? పార్టీ నుంచి వెళ్లిపోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని.. తమకు పదవులు ముఖ్యం కాదంటూ.. పార్టీ నాయకత్వానికి చురకలు అంటించారు రాజాసింగ్.గత అసెంబ్లీ ఎన్నికల్లో.. బీసీ ముఖ్యమంత్రి నినాదంతో కమలదళం ఎన్నికలకు వెళ్లింది. మిషన్-90 లక్ష్యంతో.. 90 స్థానాలు సాధిస్తామని చెప్పుకొచ్చిన కమలం నేతలు?తొమ్మిది సీట్లు కూడా సాధించలేకపోయారు. అదే అంశంపైనా రాజాసింగ్ ఫైనల్ టచ్ కూడా ఇచ్చేపారేశారు. తన బ్రాడ్ కాస్టింగ్ మీడియా గ్రూపులో.. పార్టీని, పార్టీ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ మెసేజ్ రిలీజ్ చేశారు. పార్టీలో బీసీ నినాదంపైనా రాజాసింగ్ గట్టిగానే విమర్శలు చేశారు. బీసీల పార్టీ అంటారు. బీసీ ముఖ్యమంత్రి అంటారు.. కానీ?స్టేట్ అధ్యక్షుడు, బీజేపీఎల్పీ ఫ్లోర్ లీడర్, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా వేరే కులస్తులను నియమించారని.. ఇంకెక్కడి బీసీలంటూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు.. కాంట్రవర్రీగా మారాయట. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనపై ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతున్న నేపథ్యంలో రాజాసింగ్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకునే అవకాశం ఉందని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది.జిల్లాల అధ్యక్షుల నియామకం కావొచ్చు.. బీజేపీలో బీసీలకు ప్రాధాన్యత అంశంలో కావొచ్చు? రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను బిజెపి అధిష్టానం ఎలా తీసుకుంటుందనే అంశం ఉత్కంఠగా మారింది. తన అవసరం పార్టీకి లేదా.. పార్టీ నుంచి వెళ్లమంటే ?ఈ క్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్లిపోతానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై.. రాష్ట్రనాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకోనుందే చర్చ సాగుతోంది.

# దేశానికి సరైన సమయంలో సరైన నేత ప్రధానిగా ఉన్నారు

- మొదటి పేజీ తరువాయి

వివరించారు. తిరుమలలో 75 శాతం పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణలో ఆలయాలది ప్రధాన పాత్ర అని తెలిపారు.

నాడు ఎన్టీఆర్ ఏపీ దేవాలయాల్లో అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారని చంద్రబాబు గుర్తుచేశారు. ఇవాళ నిత్యం లక్షల మంది అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారని వివరించారు. దేశ విదేశాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయాలు పెరుగుతున్నాయని, ఇంకా పెరగాలని ఆకాంక్షించారు. ఏపీలో దేవాలయాల సర్క్యూట్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతిలో అంతర్జాతీయ దేవాలయాల సదస్సును ప్రారంభించారు. ఈ దేవాలయాల మహాకుంభ్ సమావేశం మూడు రోజుల పాటు జరగనుంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హాజరయ్యారు. ఆ భారీ ఆధ్యాత్మిక సదస్సులో ప్రపంచంలోని 58 దేశాల నుంచి వచ్చిన 1,581 ఆలయాలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ సదస్సులో 15 వర్క్ షాప్ లు నిర్వహించనున్నారు. 60 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఒకరోజు కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. ఈ నెల 19న ఏపీ మంత్రి నారా లోకేశ్ హాజరు కానున్నారు.

కాగా, ఇవాళ సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా... ముంబయిలో టీటీడీకి స్థలం కేటాయించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. ముంబయిలో అమ్మవారి ఆలయం నిర్మాణం, బాంద్రాలో టీటీడీ సమాచార కేంద్రం కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఫడ్నవీస్ కు వినతి పత్రం అందించారు.

## వల్లభనేని వంశీ కేసులో కీలక పరిణామం

- మొదటి పేజీ తరువాయి

తరపు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తాను అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నానని... జైల్లో తనకు బెడ్ ఇప్పించాలని, ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలని, ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించాలని పిటిషన్ లో కోరారు. తనపై కుట్రపూరితంగా, కక్షపూరితంగా కేసు పెట్టారని పేర్కొన్నారు. సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేశాననేది తనపై అక్రమంగా పెట్టిన కేసు అని చెప్పారు.

ఇద్దరి పిటిషన్లను కోర్టు విచారణకు స్వీకరించింది. ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.జైల్లో వల్లభనేని వంశీ నేలపైనే పడుకుంటున్న సంగతి తెలిసిందే.

ఆయన ఉంటున్న సెల్ వద్ద పోలీసులు బందోబస్తును పెంచారు. వంశీ బయటకు కనపడకుండా సెల్ కు అడ్డంగా పరదా కట్టారు. జైల్లో బ్లేడ్ బ్యాచ్ లు, గంజాయి కేసుల్లో ఇరుక్కున్న వారు ఉండటంతో... వారి నుంచి వంశీకి అపాయం కలగకుండా జైలు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

## ఎవరినీ తొలగించం...

- మొదటి పేజీ తరువాయి

చర్చలు జరిపారు. ఉద్యోగుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రమోషన్లు కల్పించాలని, పీఆర్సీ అమలు చేయాలని మంత్రికి వినతులు అందాయి. ఈ సందర్భంగా మంత్రి డీవీబీ స్వామి మాట్లాడుతూ... గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఏ, బీ, సీ కేటగిరీలుగా హేతుబద్ధీకరణ చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, సర్వీసు నిబంధనలు రూపొందిస్తామని తెలిపారు. హేతుబద్ధీకరణపైనా అధికారుల కమిటీ పరిశీలిస్తుందని అన్నారు. హేతుబద్ధీకరణ ప్రక్రియతో కొందరిని తొలగిస్తారన్న అపోహలు వద్దని మంత్రి స్పష్టం చేశారు. ఎవరినీ తొలగించట్లేదని, కొన్ని శాఖల్లో చాలా ఖాళీలు ఉన్నాయని వివరించారు. మహిళా పోలీసుల విషయంలోనూ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, హోం శాఖను సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి డీవీబీ స్వామి కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కాకుండా ప్రమోషన్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని హేతుబద్ధీకరణ అంశంపై నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

### కుంభమేళాలో కొనసాగుతున్న భక్తుల తాకిడి...

## 52 కోట్ల మంది పుణ్య స్నానాలు

- మొదటి పేజీ తరువాయి

భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించినట్లు అధికారులు వెల్లండించారు. త్రివేణి సంగమంలో ఇప్పటి వరకూ 52 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించినట్లు యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ప్రకటించింది. దీంతో ప్రపంచంలోనే ఇంత మంది భక్తులు పాల్గొన్న మొదటి కార్యక్రమంగా కుంభమేళా రికార్డు సృష్టించింది.కాగా, జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా... ఈ నెల 26 వరకు కొనసాగనుంది.

దాదాపు 45 రోజుల పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచం నలుమూలల నుంచి దాదాపు 40 కోట్ల మంది భక్తులు వస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ముందుగా అంచనా వేసింది. అయితే, అంచనాలకు మించి భక్తులు తరలివస్తున్నారు.

## నందిగం సురేశ్ కు సత్తెనపల్లి కోర్టులో భారీ ఊరట

- మొదటి పేజీ తరువాయి

లేళ్ల అప్పిరెడ్డితో పాటు పలువురిపై కేసు నమోదయింది. కానీ, అరెస్టులు మాత్రం జరగలేదు.ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నందిగం సురేశ్ పై వరుస కేసులు నమోదయ్యాయి. మరియమ్మ అనే మహిళ హత్య కేసులో ఇటీవలే ఆయన బెయిల్ పై జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ కేసులో కూడా ఆయనను అరెస్ట్ చేసే అవకాశం ఉండటంతో ముందస్తు బెయిల్ కోసం ఆయన కోర్టును ఆశ్రయించారు. ఈ మధ్యాహ్నం ఆయన కోర్టులో లొంగిపోయారు. ఆయన తరపు న్యాయవాదులు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ ను విచారించిన కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణాలతో చికిత్స కోసం బయట ఉన్న నందిగం సురేశ్ కు ఈ కేసులో కూడా బెయిల్ లభించింది.

### మహా కుంభమేళాలో పాల్గొనడం

## జీవితకాలపు అనుభూతి

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ డిప్యూటీ సీఎం నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రాహ్మణి, తనయుడు నారా దేవాన్ష్ నేడు ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకు హాజరయ్యారు. త్రివేణి సంగమం వద్ద షాహి స్నానఘట్టంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. సంప్రదాయబద్ధంగా గంగాదేవికి పూజలు చేసి, హారతి ఇచ్చారు. దీనిపై నారా బ్రాహ్మణి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. మహా కుంభమేళా-2025లో పాల్గొనడం జీవితకాలపు అనుభూతి అని అభివర్ణించారు. ప్రయాగరాజ్ లో పవిత్ర స్నానం ఆచరించామని వెల్లడించారు.

ఈ మహిమాన్విత గడ్డపైకి తరలివచ్చిన కోట్లాది మంది సామూహిక విశ్వాసాల నుంచి తాను అద్భుతమైన దివ్య శక్తిని అనుభూతి చెందానని నారా బ్రాహ్మణి వివరించారు. ఈ మేరకు తమ కుంభమేళా పర్యటన ఫొటోలను కూడా ఆమె పంచుకున్నారు.

## కుంభమేళాలో బ్రాహ్మణులకు వస్త్రదానం చేసిన మంత్రి లోకేశ్ దంపతులు

- మొదటి పేజీ తరువాయి

మహా కుంభమేళా ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదు... ఇది భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వం అని... నమ్మకం, ఆచారాలు, ఆధ్యాత్మిక జ్ఞానంతో ముడిపడి ఉన్న శక్తిమంతమైన వేడుక అని లోకేశ్ పేర్కొన్నారు. మానవత్వం, ఆధ్యాత్మికత మధ్య సంబంధాన్ని, లోతుగా నాటుకుపోయిన భారతజాతి విలువలను ప్రతిబింబిస్తుందని తెలిపారు.

పవిత్ర నదుల్లో ఆచరించే స్నానం, దానం, హృదయ పూర్వకమైన భక్తి మోక్ష మార్గాన్ని చూపిస్తాయని కోట్లాదిమంది నమ్మకమని అభిప్రాయపడ్డారు. కుంభమేళాలో స్నానాలు, పూజాధికాల అనంతరం లోకేశ్ దంపతులు కాశీ విశ్వేశ్వరుని ఆలయాన్ని సందర్శించేందుకు వారణాసి బయలుదేరి వెళ్లారు.

## కేసీఆర్ కు దేవుడు పరిపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలి

- మొదటి పేజీ తరువాయి

వైసీపీ అధినేత జగన్ కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. "మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. భగవంతుడు ఆయనకు మంచి ఆరోగ్యాన్ని, సంతోషాన్ని, పరిపూర్ణ జీవితాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను" అని ట్వీట్ చేశారు. కేసీఆర్ ను కలిసినప్పటి ఫొటోను షేర్ చేశారు.

## ఢిల్లీలో ప్రభుత్వాన్ని నడిపే సామర్థ్యం గల నేతలు బీజేపీలో లేరు

- మొదటి పేజీ తరువాయి

లేదని విమర్శించారు. అందుకే కొత్త ముఖ్యమంత్రిని ప్రకటించడానికి బీజేపీ వెనుకడుగు వేస్తోందన్నారు. దేశ రాజధానిలోనే ప్రభుత్వాన్ని నడిపే సత్తాలేని వారు ఇక ప్రజల అభివృద్ధి కోసం ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. కాగా, ఈ నెల 20న కొత్త ప్రభుత్వం కొలువుదీరనుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

### పోలీసుల ఎదుట లొంగిపోయిన

## గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి నిందితులు

- మొదటి పేజీ తరువాయి

2023లో జరిగింది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా... ఈ కేసు దర్యాప్తు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధకారంలోకి వచ్చాక కేసును రీఓపెన్ చేశారు.

ఈ కేసులో ఏ71గా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కొన్ని రోజుల కిందటే పోలీసులు కిడ్నాప్ వ్యవహారంలో అరెస్ట్ చేయడం తెలిసిందే.

## శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

- మొదటి పేజీ తరువాయి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆలయ కమిటీ ఆహ్వానించింది. శ్రీశైలం బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు నిర్వహించనున్నారు. ఇవాళ ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబును కలిసిన శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఆలయ వేద పండితులు సీఎం చంద్రబాబుకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ప్రసాదాన్ని అందించి వేదాశీర్వచనం పలికారు. సీఎంను కలిసిన వారిలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కూడా ఉన్నారు.

## ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణకు బీజేపీ వల్ల ఒరిగింది ఏమీ లేదని.. ఆ పార్టీ కేవలం మతాన్ని రెచ్చ గొట్టి రాజకీయ పబ్బం గడుపుతుందని విమర్శించారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం గురించిన మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు నిరుద్యోగులను మోసం చేసే పార్టీలని.. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

## ఏపీలో 9 రోజుల పాటు కేంద్ర బడ్జెట్ పై మేధావుల చర్చలు

### ఇటీవల వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రం

### ఏపీలో మేధావుల చర్చలు

### పలు నగరాల్లో సమావేశాలకు హాజరుకానున్న కేంద్రమంత్రులు, ఎంపీలు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.50.65 లక్షల కోట్లతో 2025-26 వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఏపీలో 9 రోజుల పాటు కేంద్ర బడ్జెట్ పై మేధావులతో చర్చలు ఏర్పాటు చేశారు. ఈ చర్చలకు కేంద్రమంత్రులు, ఎంపీలు హాజరుకానున్నారు. (ఫిబ్రవరి 18) గుంటూరులో జరిగే చర్చకు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరుకానున్నారు. ఫిబ్రవరి 19న తిరుపతిలో జరిగే సమావేశానికి కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరవుతారు. ఈ నెల 21న విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశానికి కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి హాజరు కానున్నారు. ఈ నెల 22న విశాఖలో జరిగే సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హాజరవుతారు. అదే రోజున రాజమండ్రిలో జరిగే సమావేశానికి బీజేపీ ఎంపీ పురందేశ్వరి... కాకినాడలో జరిగే సమావేశానికి మరో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ హాజరుకానున్నారు. ఇతర సమావేశాల వివరాలు తెలియాల్సి ఉన్నాయి.

# వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ గా కురసాల కన్నబాబు

**కాకినాడ. పెన్ పవర్ ఫిబ్రవరి 17 :** వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ గామాజీ మంత్రి కురసాల కన్నబాబు ఎన్నికయ్యారు ఈ సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ జమ్మలమడక నాగమణి ఆయనకు పుష్ప గుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొనడం జరిగినది.



పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

**కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు**



**కాకినాడ, పెన్ పవర్ ఫిబ్రవరి 17:** జర్నలిస్టులపై దాడులను అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ కోరారు. పార్వతిపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై తెలుగు దేశం నేత దాడి నేపథ్యంలో జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలికి ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన దాడి వివరాలను కలెక్టర్ కు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం మక్కువ మండల "ప్రజాశక్తి" విలేకరి రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు ఆదివారం దాడి చేయడమే కాకుండా 'నిన్ను చంపడం ఖాయం" అంటూ బెదిరించడం దారుణమన్నారు. ఈ దాడిని ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కాకినాడ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మక్కువ మండలం ఏ- వెంకంపేట నుండి కాశీపట్నం వెళ్లే నూతన రహదారి వద్ద వేణుగోపాల్ నాయుడిని కలవడానికి వెళ్లిన విలేకరి రామారావుపై టిడిపి నేత బూతులు తిట్టడమే కాకుండా దాడి చేశారని ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. ఇటీవల ప్రజాశక్తి పత్రికలో 'ఎన్నికల కోడ్ అధికారులకు పట్టదా ..?' అనే శీర్షికన %ొ% మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీలతో ఉన్న ఫోటోతో వార్త వెలువడగా కక్ష్య పెట్టుకున్న వేణుగోపాల్ నాయుడు ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ ఈ దాడికి పాల్పడ్డారన్నారు. విలేకరి రామారావుపై భౌతిక దాడికి తెగబడ్డాడు. షర్ట్ పట్టుకొని తలపై కొట్టాడని, ఇంకా దాడి చేస్తుండగా అక్కడ ఉన్న వ్యక్తులు అడ్డుకున్నారన్నారు. నీ అంతు చూస్తాను. నిన్ను ఇక్కడ చంపి పాతి పెడతానంటూ ఆగ్రహంతో విలేకరిపై విరుచుకుపడడం ఎంత వరకూ సమంజసం అన్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని చెప్పారు. వెంటనే కేసు నమోదు చేసి వేణు గోపాల్ నాయుడుని అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తనపై గాని మండలంలోని తన పార్టీ నాయకులు, కార్యకర్తలపై గాని ఎలాంటి వార్తలు రాసినా ' నీ భార్య పిల్లలకు నువ్వు దక్కవు. నిన్ను చంపడం ఖాయం ' అంటూ బెదిరించడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులకు రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. మక్కువ మండల విలేఖరికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు జి. శోభన్ బాబు, వాసంశెట్టి శ్రీనివాస్, కె. సత్యనారాయణ(సత్య), మంగా వెంకట శివరామ కృష్ణ, రాంజీ, ప్రజాశక్తి సిబ్బంది డి. శ్రీనివాస్, సురేష్, మంజన్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల మద్దతుతో కూటమి

# అభ్యర్థి రాజశేఖర్ విజయం ఖాయం

**శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ. పెన్ పవర్ ఫిబ్రవరి 17 :** విజ్ఞులైన పట్టభద్రుల మద్దతుతో ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం ఖాయమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.

కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు సోమవారం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , పలు కార్యాలయాల నందు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ను బలపరచాలని కోరుతూ కరపత్రాలను అందించి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న పేరాబత్తుల రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అపార అనుభవంతో కృషి చేస్తున్నారని, విద్యావంతులు మేధావి వర్గాలు సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఇచ్చారని, అదే ఒరవడిని ఉమ్మడి ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొనసాగించాలని కోరారు. నిరుద్యోగ నిర్మూలన, విద్యారంగం పటిష్టత, ఉద్యోగ అవకాశాలు కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి పట్టభద్రులంతా అండగా ఉండాలని కోరారు. ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా తమ విలువైన ఓటును ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, ఒమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, చింతలపూడి రవి, పసుపులేటి వెంకటేశ్వరరావు, కోనాడ ప్రకాష్, అమలకంటి బలరాం, పొంగా బుజ్జి, బంగారు సత్యనారాయణ, కోడూరు పెద్ద, తదితరులు పాల్గొన్నారు.





# కిక్ బాక్సింగ్ లో సురేష్ కు స్వర్ణం

**కలెక్టర్ ఎమ్మెల్యే ల అభినందన**

**కాకినాడ. పెన్ పవర్ ఫిబ్రవరి 17 :** ఢిల్లీలో ఫిబ్రవరి 01 నుంచి 05వ తేదీ వరకు జరిగిన వాకో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో 14 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం సాధించిన కరప మండలం, అరట్లకట్ట గ్రామానికి యాళ్ల సురేష్ కుమార్ సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ ను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసారు. ఇదే స్ఫూర్తితో మరింత ఉన్న స్థాయికి ఎదిగేందుకు పట్టుదలతో కృషి చేయాలని ఆయన సూచించారు. రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి లేని విద్య విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు దోహదపడుతుందని అన్నారు యాళ్ల సురేష్ భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని తద్వారా తల్లిదండ్రులకు జిల్లాకు మన రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

# కానరాని సీసీ కెమెరాలు.. పట్టించుకోని అధికారులు



**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి :17** సీతానగరం మండల కేంద్రంలో నేరాలు అదుపు చేయడం కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకుండా కొన్ని కనిపించకుండా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. దీంతో ఏదైనా ప్రమాదాలు, నేరాలు జరిగినా ఉపయోగం లేకుండా పోతుంది. ఫలితంగా కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండల కేంద్రంలో మూడు బొమ్మలసెంటర్ బస్టాండ్ కు వెళ్లే మార్గంలో మెయిన్ రోడ్ లో అనేకచోట్ల కెమెరాలు పాడైపోవడం, పని చేయకుండా ఉండడం పట్ల కొన్ని కెమెరాలు లేకపోవడంతో అధికారులు ఇప్పటికీ దృష్టి సారించకపోవడం బాధాకరం. నిజానికి నేరాలను అరికట్టడానికి పోలీసు వ్యవస్థకు ఇవి ఎంతో దోహదం చేస్తాయి. అందువల్ల అధికారులు వెంటనే సీసీ కెమెరాలపై దృష్టి సారించి వాటిని పనిచేసే అమర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఒక సీసీ కెమెరా వేల కన్నులతో సమానమని నానుడి తెలిసిందే. ఏదైనా నేరాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ముందుగా అప్రమత్తమై పని చేయకుండా ఉన్న సీసీ కెమెరాలు అన్నింటిని పనిచేసేలా చేస్తే ప్రజలకు, పోలీసు వ్యవస్థకు మేలు చేకూరే అవకాశం ఉంది. అప్పట్లో సీతానగరం మండల కేంద్రంలో ఎస్సైగా పనిచేసిన ఎస్సై డి. ఆనంద్ కుమార్ చొరవతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు, నేరాల నియంత్రణలు రోడ్డు ప్రమాదాలు తదితర వంటి వాటికి సీసీకెమెరాలు ఆధారాలు ఉండేవి, అతను ఎప్పుడైతే వేరే ప్రాంతానికి బదిలీ అవడంతో అప్పటినుంచి సిసి కెమెరాలు ఎంతమంది అధికారులు మారిన ఇప్పటివరకు సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో మండల ప్రజలు వాపోతున్నారు, ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు,

# పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ప్రచారం



**కాజులూరు, పెన్‌పవర్, ఫిబ్రవరి 17:** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డి.వి. రాఘవులును గెలిపించాలంటూ సోమవారం కాజులూరు మండల పరిధిలోని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం నాయకులు వల్లు రాజుబాబు వినాయక స్కూల్ టీచర్లను అభ్యర్థించారు. రాష్ట్ర ప్రజల సమస్యలపై గళం ఎత్తే నాయకుడు పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర్రాఘవులు మాత్రమే అంటూ కరపత్రలు పంపిణీ చేసారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు వేసేటప్పుడు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం బ్యాంక్ ఉద్యోగులకు కరపత్రాలు పంచారు. శాసన మండలిలో ఎటువంటి సమస్యనైనా లేవనెత్తగలరని వివరించారు. ప్రజల సమస్యలు తీరాలంటీ పీడీఎఫ్ అభ్యర్థి డివి రాఘవుల గెలుపుకు కృషిచేయాలని పేర్కొన్నారు.

# కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి





**ఏఐటీయూసీ డిమాండ్**

**తాడేపల్లిగూడెం , పెన్ పవర్, ఫిబ్రవరి 17:** మునిసిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసి వారికి ఉద్యోగ , వేతన భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ దశలవారీ ఆందోళనా కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మునిసిపల్ ఇన్ ఛార్జ్ కమిషనర్ కు ఏఐటీయూసీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి సోమసుందర్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన అప్కాస్ ను రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని , అది నిజమే అయితే దానిపై ముందుగా కార్మిక సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలన్న తమ చిరకాల డిమాండ్ ను ఇప్పుడైనా పరిగణన లోకి తీసుకోవాలని కోరారు. కార్మికులతో సంప్రదించకుండా ఏక పక్ష నిర్ణయం తీసుకుంటే ప్రతిఘటిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి మందలపర్తి హరీష్ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే ప్రత్యామ్నాయం ఏమిటన్న అంశాన్ని చర్చించకుండా కార్మికుల పని పరిస్థితులను గందరగోళం లోకి నెట్టడం సరికాదన్నారు. ఏఐటీయూసీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం ముప్పై ఆరు వేలు ఇవ్వాలని, అవసరాల మేరకు సిబ్బంది సంఖ్య, వాహనాల సంఖ్య పెంచాలని, మూడేళ్లుగా బకాయి పెట్టిన సరెండర్ లీవు ఎన్ క్యాష్ మెంట్ , మూడు డి ఏ లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా కమిటీ కోశాధికారి అల్లం కుమారస్వామి, మునిసిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కొడమంచిలి చంద్రరావు , ఉప్పాటి నాగరాజు, రౌతు రాజేష్, బి. శివశంకర్ , తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేట అన్నా క్యాంటీన్ లో అన్నదానం

**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్నా క్యాంటీన్లో సోమవారం అన్నదానం నిర్వహించారు. గత మూడు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ కు ఈ వారం జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మారిశెట్టి భద్రం, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పిటిసి మారిశెట్టి పాపారత్నం తనయుడు మారిశెట్టి జగ్గారావు, మౌలిక దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ అన్నా క్యాంటీన్ ను మారిశెట్టి భద్రం ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా మారిశెట్టి భద్రం మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చాలని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. జగ్గంపేటలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసే వరకు దాతల సహకారంతో కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, జగ్గంపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మారిశెట్టి రాధా, కింగం రమణ, నలమాటి ఆనంద్, దేగల సత్తిబాబు, ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్ రాజు, కోడూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## నానికి ముద్రగడ పరామర్శ......



**ప్రత్తిపాడు, పెన్ పవర్ ఫిబ్రవరి 17 :** మండలంలోని వేములపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చందక నాని తండ్రి చందక కృష్ణ ఇటీవల కాలంలో మరణించడంతో వారి కుటుంబాన్ని ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. గిరిబాబు వారి కుటుంబాన్ని పరామర్శించి కృష్ణ ఆత్మకు శాంతి కలగాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ కు మద్దతుగా ప్రచారం

**కరప, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరిజిల్లాల ఎమ్మెల్సీ అభర్యి జీవీ సుందర్ కు మద్దతుగా సోమవారం మండల ఎస్సీ నాయకులు ప్రచారం చేశారు. వేళంగి, జి.భావారం, యండమూరు, కరప, వేములవాడ తదితర గ్రామాల్లో ఎస్సీ నాయకులు మారెళ్ల వెంకటరమణ, వజ్రపు కామేశ్వరరావు, సాదే లోహిదాస్, సవిలే రాజేష్ తదితరులు పర్యటించి గ్రాడ్యుయేట్ ఓటర్లను కల్సి ఎమ్మెల్సీ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న సుందర్ ను గెలిపించాలని అభ్యర్థించారు. బ్యాలట్ లో 34వ నంబర్ పై మొదటి ప్రాధాన్యత ఓటుగా వేయాలన్నారు.

## నిరంతర పారిశుధ్య నిర్వహణ.



**మండపేట. పెన్ పవర్.ఫిబ్రవరి 17:**పారిశుధ్య నిర్వహణ నిరంతరం కొనసాగే ప్రక్రియ అని మున్సిపల్ కమీషనర్ టి.వి.రంగారావు పేర్కొన్నారు. మెప్మా ఆర్.పి లతో కలిసి వార్డులలో ప్రజలకు తడి చెత్త పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇచ్చే విధంగా అవగాహన కల్పించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 6,10,11 వవార్డులలో కమిషనర్ పర్యటించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది ని న్యూ కాలనీ లో యింటి నిర్మాణ సామాగ్రి ను తొలగించాలని ఆదేశించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు,మెప్మా సి ఎం ఎం పి సుజాత, సి ఓ లు శానిటేషన్ సెక్రటరీ జి. సుధీర్ వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట.పాల్గొన్న వేగుళ్ళ లీలాకృష్ణ .



**మండపేట. పెన్ పవర్.ఫిబ్రవరి 17:**కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామంలో శ్రీ సీతారామ, అభయాంజనేయ స్వామి వారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్య అధితిగా మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇంచార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ పాల్గొన్నారు. వేద పండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేసారు.

## ఇర్రిపాకలో కొలువుతీరిన శివ కేశవులు





**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు ఆధ్వర్యంలో సోమవారం శివ కేశవుల ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించి అనంతరం కోటిలింగేశ్వరుడు విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. తుని తపోవనం స్వామీజీ సచ్చిదానంద స్వామీజీ, శృంగేరి పీఠం ఆంధ్ర, తెలంగాణ ప్రచారకర్త బంగారయ్య శర్మ, వారణాసి శృంగేరి పీఠం ఇన్చార్జి ఇంద్రకంటి సత్యం, వేద పండితులు చేతుల మీదుగా ఈ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు, జ్యోతుల నెహ్రూ మనవడు అనీష్ నెహ్రూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, దాట్ల బుచ్చిరాజు, వరుపుల సత్య ప్రభ, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి, జానకి దేవి, బెంగళూరు దర్శన్, రాజమండ్రి కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు చిక్కాల రామచంద్రరావు, వరుపుల సుబ్బారావు, ఎస్వీఎస్ఎన్ వర్మ,, ఆదిరెడ్డి అప్పారావు, చైతన్య రాజు, వాసిరెడ్డి ఏసుదాసు, రాజమండ్రి మాజీ మేయర్ ఆదిరెడ్డి వీర రాఘవమ్మ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల బాబు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వీరందరికి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.





## ఇర్రిపాకలో శివకేశవులను దర్శించుకున్న జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి



**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 17**: జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఏలేరు నదీ తీరాన జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఏర్పాటు చేసిన శివకేశవుల విగ్రహ ప్రతిస్టాపన కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఇంచార్జ్ దాట్ల కృష్ణ వర్మ, జనసేన నాయకులు సూరంపాలెం బాలు, ఎల్లపు దొరబాబు, మాదారపు వీరబాబు, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మొగిలి గంగాధర్, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా, గోకేడ ప్రసాద్, రాజనాల శ్రీను, సద్గురు మూర్తి, కర్ణాకుల సూరిబాబు పాల్గొన్నారు.

## భారత జనతా పార్టీ నూతన కమిటీ నియామకం.





**మండలంలో నూతన కమిటీ సమర్ధవంతంగా పనిచేయాలి, బి జె పి మండల అధ్యక్షుడు.**

**యు.వెంకటేశ్వరరావు .**

**ఆత్రేయపురం: పెన్ పవర్, ఫిబ్రవరి 17:**భారతీయ జనతా పార్టీ మండల ఎన్నిక సన్నాహక కమిటీ అధ్యక్షుడు యు. వెంకటేశ్వరరావు ఇంటి వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి అతిథులుగా అంబేద్కర్ కోనసీమ జిల్లా బి జె పి ప్రధాన కార్యదర్శి చికూరుమిల్లి శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్ యిల్ల సత్యనారాయణ. జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు మండల,కన్వీనర్ సత్యనారాయణ బి జె పి పార్టీ సాధించిన ప్రగతిని గూర్చి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆత్రేయపురం మండల ఎన్నికల ఆర్వో అయినవిల్లి సత్తిబాబు గౌడ్ మాట్లాడుతూ 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీ గడ్డపై సంచలన విజయం సాధించిందని కార్యకర్తలకు వివరించారు. బిజెపి యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటన భారత విదేశాంగ విధానాల గురించి వివరించారు. అనంతరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లడుతూ భారతీయ జనతా పార్టీ ఆత్రేయపురం మండల ప్రధాన కమిటీని ప్రకటించారు. మండల ప్రధాన కార్యదర్శులుగా తాడాల సుబ్రహ్మణ్యం (పండు), యజ్జవరపు అప్పారావు, ఉపాధ్యక్షులుగా చంపాటి అనిల్ కృష్ణ వర్మ, కాళాబత్తుల రామచంద్రన్, అల్లు శివరామకృష్ణ, కార్యదర్శులుగా మద్దూరి నిర్మల్ కుమార్, తణుకు కొండలరావు, అత్తిలి హరిబాబు, ప్రబల రవిశంకర్, మండల పతాధికారులుగా వానపల్లి సుబ్బారావు, చిటికెన రాంబాబు, మట్ట సత్యనారాయణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ మండల ప్రధాన కమిటీలో నూతన బాధ్యతలతో కొనసాగుతారని, ఏ విధమైన బేధాభిప్రాయాలు లేకుండా గ్రామాల్లో కార్యకర్తలను, బూత్ కమిటీల సభ్యులను అందరినీ కలుపుకొని స్నేహభావంతో ముందుకు సాగాలని, మండలంలో పార్టీ బలోపేతానికి నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని మండల అధ్యక్షుడు యు.వెంకటేశ్వరరావు తెలిపారు.

## పొగాకు బ్యారన్ దగ్ధం

**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :**పొగాకు బ్యారన్ క్యూరింగ్ జరుగుతుండగా అగ్నికి ఆహుతి అయింది. సోమవారం ఉదయం జీలుగుమిల్లిలో కొవ్వుల ప్రసాద్ బ్యారెన్ లో పొగాకు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదవసత్తు కాలిపోయిందని తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం



సిబ్బంది వచ్చి మంటలను ఆరిపివేశారు. ఈ ప్రమాదంలో సుమారు నాలుగు లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

## నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం -కలెక్టర్ ఆదేశాలు బేకాతర్



**అల్లవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** మండలంలో జిల్లా కలెక్టర్ సాగు భూములకి నీరు అందించాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచనలు చేసిన నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. అల్లవరం మండలం కొమరగిరి పట్టణం గ్రామం నాలుగో నెంబర్ పంట కాలువ ఆయకట్టు భూములకు సాగునీరు అందట%శీ% లేదని సోమవారం తహసిల్దార్ కి రైతులు ఫిర్యాదు చేసారు. నీటిపారుదల శాఖ అధికారులు సాగునీరు అందించడంలో విఫలమవుతున్నారని రైతులు ఆందోళన చెందారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలాగా నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాగునీరు అందిస్తామని తెలియజేయడం జరిగింది .ఈ కార్యక్రమం లో కె రామకృష్ణతో పలు రైతులు పాల్గొనడం జరిగింది.

## రోడ్డు మార్జిన్ లో కోడివ్యర్థాల దుర్వాసన భరించలేకపోతున్నాం



**కరప, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** నివాస గృహాలకు సమీపంలో రోడ్డుమార్జిన్ లో కోడి వ్యర్థాలు వేయడంతో వచ్చే దుర్వాసన భరించలేక పెనుగుదురు వంతెన సమీప ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెనుగుదురు-కోటిపల్లి రోడ్డులో పొడవునా మాంసం విక్రయదారులు కోళ్లకు సంబంధించిన వ్యర్థాలను చచ్చిన కోళ్లను వేసి, వెళ్లిపోతున్నారు. ఖాళీ కొబ్బరిబొండాలు, వేయడంవల్ల కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు దుర్వాసన భరించలేకు అనారోగ్యాల పాలవుతున్నట్టు విశ్రాంత ఎంఎస్ఓ సుబ్బారావు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి గృహాలకు సమీపంలో ఎటువంటి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని పెనుగుదురు వంతెన ప్రాంతప్రజలు కోరుకుంటున్నారు.

## న్యాయమైన హామీలు నెరవేర్చాలి




**పెనుమంట్ర, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**సమ్మె కాలంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సోమవారం పెనుమంట్ర మండలంలోని ఐసిడిసి ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు.
ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ మండలాలకు చెందిన అంగన్వాడీలకు తక్కువ వేతనాలతో తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని కావున ప్రభుత్వం మా సమస్యలను అర్థం చేసుకొని వెంటనే పరిష్కరించాలని ఐసీడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అంగర
కృష్ణ కుమారి కి వినతి పత్రం అందించారు.కార్యకర్తలతో పాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్, కౌలు రైతు జిల్లా సభ్యులు కె.సుబ్బరాజు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కేతా పద్మజ పాల్గొన్నారు.

## ప్రజాశక్తి విలేఖరి పై దేశం దాడి దారుణం

**పెనుమంట్ర ఫోర్త్ ఎస్టేట్ విలేకరుల బృందం ఖండన**





**పెనుమంట్ర, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలానికి చెందిన ప్రజాశక్తి జాతీయ దినపత్రిక విలేకరి ఎం.రామారావు పై అప్రజా స్వామ్యకంగా దాడి చేసిన టీడీపీ మండలాద్యక్షుడు గుల్ల వేణు గోపాల నాయుడు చేసిన దాడి
కడు హేయమని, ప్రజాస్వామ్య వాదులు దీనిని తీవ్రంగా ఖండించాలని పెనుమంట్ర మండలం ఫోర్త్ ఎస్టేట్ విలేకరుల బృందం కోరారు.
ఈ మేరకు స్థానిక తహసీల్దార్ వై. రవికుమార్ కు, పోలీస్ స్టేషన్ ఇంచార్జి
ఎస్.దానేశ్వరి లకు విలేకరులు, స్థానిక సీపీఎం నాయకులు కుశంపూడి సుబ్బరాజు, కేతా పద్మజ తదితరులు పాల్గొన్నారు.విలేకరులు మాట్లాడుతు
జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రజా సమస్యలను, ప్రభుత్వ, ప్రయివేట్ కార్యక్రమాలను నిత్యం ప్రజలకు చేరవేసే పనిలో ఉండే విలేకరులపై దాడులు చేయడం తగదని వారు అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్ట్ లకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

## పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులను గెలించాలి



**పెనుమంట్ర, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో పి.డి.ఎఫ్. ఎమ్మెల్సీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న డి.వి.రాఘవులు కు మొదటి ప్రధాన్యతా ఓటు ఇచ్చి గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ ఓటర్లను కోరారు.
సోమవారం ఉదయం నుండి రాత్రి వరకు మండలం లోని మార్టేరు గ్రామంలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి, పీ.డీ. ఎఫ్. ఎ మ్మెల్సీ ఓట్లు ను ఆయన అభ్యర్థి%శీ% చారు. ఈ కార్యక్రమం లో ఆయనతో సీపీఎం నాయకులు సూర్య ప్రకాష్, పిల్లి జగదీష్లు,త్తిగ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ సర్టిఫికెట్లు అందజేత




**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఫిబ్రవరి 17** :మహిళలలు స్వసక్తితో అభివృద్ధి చెందడానికి తపన ఫౌండేషన్ ఎంతగానో దోహదపడుతుందని ఏలూరు జిల్లా బిజెపి కార్యదర్శి చాత్రాతి ప్రసాదు అన్నారు. సోమవారం
జీలుగుమిల్లి, దర్భ గూడెం గ్రామాలలో మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపన ఫౌండేషన్ ద్వారా ఈ గ్రామాలలో మహిళలకు మూడు నెలలపాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఇచ్చిన సర్టిఫికెట్లు వారికి ఉపయోగపడతాయని అన్నారు .ఈ కార్యక్రమంలో బిజెపి మండల కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, కంచర్ల పాండురంగారావు, తపన ఫౌండేషన్ ప్రతినిధులు శివ, గణేష్ ,లక్ష్మణ్ ,సాయి తదితరులు పాల్గొన్నారు.

# మండపేట లో. రాజమండ్రి రోజ్ మిల్క్ షాప్ ప్రారంభం.

**మండపేట. పెన్ పవర్. ఫిబ్రవరి 17** :మండపేట పట్టణంలో వాణిమహాల్ వద్ద ఉన్న శ్రీ వి.వి.ఎస్.ఎస్.చౌదరి షాపింగ్ కాంప్లెక్స్ లో నూతనంగా ఏర్పాటుచేసిన రాజమండ్రి రోజ్ మిల్క్ వారి ఫ్రాంచైజీ ను సోమవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, కొనగళ్ళ సత్యనారాయణ, జొన్నపల్లి సూర్యారావు, గడి రాంబాబు, బడుగు రత్నం రాజు, పాలచర్ల శిరీష్, బొడ్డు రామకృష్ణ, పిల్లా గణపతి, వంక మణి, తదితర్లు పాల్గొన్నారు.



## పెన్షన్,జిపిఎఫ్ కేసులను సమీక్షించడానికి పెన్షన్,జిపిఎఫ్ అదాలత్

- ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్
- శాంతి ప్రియ సరేళ్ల

**కాకినాడ.పెన్ పవర్ ఫిబ్రవరి 17** :ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ ఏ పి, విజయవాడ వారు ఫిబ్రవరి 21న కాకినాడ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు/జిపిఎఫ్ కేసులను సమీక్షించడానికి , పరిష్కరించడానికి ,డీడీవోలకు సమర్ధవంతంగా సేవలను అందించడానికి,జిపిఎఫ్ సమయానికి అందించడానికి "పెన్షన్ మరియు జిపిఎఫ్ అదాలత్" నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్( ఏ అండ్ ఇ) ఆంధ్రప్రదేశ్ శాంతి ప్రియ సరేళ్ల ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లాలోని జిల్లా అధికారులు/డ్రాయింగ్ , పంపిణీ అధికారులందరూ ఫిబ్రవరి 21న కాకినాడ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల "విధాన గౌతమి మీటింగ్ హాల్"లో ఉదయం 10.00 గంటలకు నిర్వహించే "పెన్షన్ మరియు జిపిఎఫ్ అదాలత్ కు పెండింగ్ లో ఉన్న పెన్షన్ కేసులు/జిపిఎఫ్ సమస్యలు వివరాలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ (ఏ %డ% ఇ) ఆంధ్రప్రదేశ్ శాంతి ప్రియ సరేళ్ల ఒక ప్రకటనలో కోరారు.ఈ పెన్షన్, జిపిఎఫ్ అదాలత్ లో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్) కిషోర్ రెడ్డి పోలు,డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (ఎన్ టైటిల్మెంట్స్) లలిత్



కుమార్. వి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (పెన్షన్స్ ) జి. సునీత , సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (పెన్షన్స్) టి. విజయ్ కుమార్ , సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జిపిఎఫ్) డి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొని జిపిఎఫ్ , పెన్షన్ సమస్యలను అక్కడకక్కడే పరిష్కరించడం జరుగుతుందని ఆమె ఒక ప్రకటనలో వివరించారు.

## అన్నమ్మ చెరువు పార్క్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



**డోకుబుర్ర భద్రం మాస్టారు**

**కలెక్టర్ కు వినతి**

**కాకినాడ.పెన్ పవర్ ఫిబ్రవరి 17** :స్థానిక ఘాటి సెంటర్లో గల అన్నమ్మ చెరువు పార్క్ ను అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక అధ్యక్షులు డోకుబుర్ర భద్రం మాస్టారు ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం పని చేస్తున్న ఇద్దరు వాచ్మెన్లు తోడుగా అదనపు వాచ్మెన్ నియమించాలని పార్కు లోపల పరిశుభ్రంగా చేయుటకు రోజు విడచి రోజు శానిటరీ సిబ్బందిచే పరిశుభ్రం చేయించాలని ఆయన కోరారు. అల్లరి ఆకతాయిలను తాగుబోతులను, తిరుగుబోతులను గంజాయి బ్యాచిలను నిరోధించాలని, పాడైపోయిన గేట్ల గుండా పశువులు కుక్కలు మేకలు ప్రవేశించి వాటి మలమూత్రాలు చేత అపరిశుభ్రంగా తయారవుతుందని ఆయన అన్నారు. అందుచేత పాడైపోయిన గేట్లు వెల్డింగులు చేయించి కుక్కలు మేకలు పశువులు లోనికి రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.బాపూజీ నగర్ నందు నగరపాలక సంస్థ జనరల్ ఫండ్ చే నిర్మించిన కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ ఫ్లోర్ ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణం చేసి రెండు సంవత్సరాలు అయినప్పటికీ దాని తాలూకా బిల్లులను చెల్లించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీ





**నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు**

**రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి**

**రాజవొమ్మంగి పెన్ పవర్ ఫిబ్రవరి17:**రాజవొమ్మంగి మండలం లో ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలోపోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వాహన దారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డులు వెంట తీసుకొని రావాలని అలానే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ ఐ నరసింహమూర్తి అన్నారు. రికార్డులు సక్రమంగా లేకపోతే ఎంవి చలానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలానే వాహనాలు నడిపేటప్పుడుట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## సమస్యల పరిష్కరించాలంటూ అంగన్వాడీల నిరసన.

**రాజవొమ్మంగి: పెన్ పవర్ ఫిబ్రవరి 17:** తమ సమస్యల తక్షణం పరిష్కరించాలని మండలంలోని అంగన్వాడి వర్కర్లు సోమవారం సిఐటియు జరిగిన స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట బయటాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. మీ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె వెంకటలక్ష్మి,సిహెచ్ కుమారి,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పి రామరాజు తదితరులు మాట్లాడుతూ.42 రోజుల సమ్మెలో 11 డిమాండ్స్ అమలు చేస్తు ఇచ్చిన జివో తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని,గ్రాడ్యుటీ సదుపాయం కల్పించాలని,మినీ అంగన్వాడి కేంద్రాలను అప్ గ్రేడ్ చేయాలని, సూపర్వైజర్ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని,ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సూపర్వైజర్లకు అందజేశారు.ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు మంగ,రత్నం,సత్యవతి, లక్ష్మి,సుందరమ్మ,రమణి,మేరీ పెద్ద సంఖ్యలో అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.
ఫోటోరైటాప్.. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడిలు.



## విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ళ.



**మండపేట.పెన్ పవర్.ఫిబ్రవరి 17:**కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామంలో శ్రీ సీతారామ, అభయాంజనేయ స్వామి వారి నూతన ఆలయ శిలామయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవం లో సోమవారం రాష్ట్ర అంచనాల కమిటి చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. స్వామి వార్లకు ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు స్వామి వారి తీర్థ, ప్రసాదాలు ఎమ్మెల్యే కు అందజేశారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వేగుళ్ళకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వల్లూరి అప్పలరాజు, కురుపూడి చిన్న, పంపన సత్తిబాబు, నరాల వెంకటరమణ, తదితర్లు పాల్గొన్నారు.

## సర్వేలపై మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందికి శిక్షణ



**కాకినాడ.పెన్ పవర్ ఫిబ్రవరి 17** :కాకినాడ జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీల్లోని సచివాలయాల పరిధిలో పూర్తి చేయాల్సిన ఆరు సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్ ఆదేశించారు. ఎంఎస్ఎంఈ, మిస్సింగ్ సిటిజన్స్ ఇన్ హౌస్‌హెూల్డ్స్, జియో ట్యాగింగ్, నాన్ రెసిడెన్సీ ఇన్ ఏపీ, చిల్డ్రన్స్ విత్‌వుట్ ఆధార్, డెత్ ఆడిట్ ఇలా పలు సర్వేలను పూర్తి చేయడంలో కాకినాడ నగరపాలక సంస్థ ముందంజలో ఉండగా.. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం,తుని, గొల్లప్రోలు తదితర మున్సిపాలిటీలు వెనుకబడ్డాయి.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు కాకినాడ కమిషనర్ భావన సూచనలతో ఆయా మున్సిపాలిటీ పరిధిలోని కమిషనర్లు, నోడల్ ఆఫీసర్లు, సచివాలయాల సిబ్బందికి శిక్షణను కాకినాడ నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ కార్యాలయంలో అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన అధ్యక్షత సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించారు. సర్వేలను సకాలంలో పూర్తి చేయకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలను సకాలంలో పూర్తి చేయగలిగితేనే ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో శైలజ, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి




**గోపాలపురం,పెన్ పవర్ ఫిబ్రవరి 17** :అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ గోపాలపురంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్,హెల్పర్స్ సంఘం, మండల స్థాయి సభ్యుల అధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.స్థానిక సిడిపిఓ కార్యాలయం వద్ద పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సిడిపిఓ కు అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం 26000 చెల్లించాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మినీ సెంటర్ లను ప్రధాన సెంటర్లుగా మార్పు చేయాలన్నారు.హెల్పర్స్ కు పదోన్నతి కల్పించాలన్నారు.సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు సైతం అమలు చేయాలన్నారు.మెనూ ఛార్జీలు పెంచి ఉచితంగా గ్యాస్ సరఫరా చేయడంతో పాటు వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం మూడు నెలలు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు పర్యటన అడ్డుకున్నారు..





## అధ పాతాళానికి పోయారు..

## అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి.

**అనపర్తి,పెన్ పవర్,ఫిబ్రవరి 17** గత సంవత్సరం ఇదే రోజున ఇదేం కర్మ మన రాష్ట్రానికి చంద్రబాబు పర్యటన అడ్డుకుని వైయస్సార్ పార్టీ అధపాతాళానికి పోయిందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. "ఇదేం కర్మ" మన రాష్ట్రానికి అనపర్తి లో ప్రస్తుత ముఖ్యమంత్రి అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటన అడ్డుకొని నేటికీ సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా నాయకులు కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పతనానికి అనపర్తిలో నాందిపలికారని దానికి చంద్రబాబు నాయుడు పర్యటన అడ్డుకోవడంతో ప్రారంభమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి దాష్టికాలను కార్యకర్తలు ఎదురొడ్డి పర్యటన విజయవంతం చేశారు. చంద్రబాబును బిక్కవోలు మండలం బలబద్రపురం నుండి అనపర్తి వరకు ఏడు కిలోమీటర్లు నడిపించరన్నారు. చంద్రబాబు నాయుడు పర్యటనను అప్పుడు ఎమ్మెల్యే స్థానిక పోలీసులు అడ్డుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారని అన్నారు.. తెలుగుదేశం కార్యకర్తలు తెగువ ముందు వారి ప్రయత్నాలు బెడిసి కొట్టేయనన్నారు. దీనితో ఆంధ్రప్రదేశ్ లోనే అనపర్తి లో జరిగిన సంఘటన చారిత్రాత్మకమైనదన్నారు.
రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ఇదొక ముఖ్యమైన కారణం. అనపర్తి లో ఆ కార్యక్రమం ప్రపంచంలో తెలుగు వారందరినీ ఆకట్టుకుందని అన్నారు. ఏడుపదుల వయసులో చంద్రబాబు నాయుడుని ఏడు కిలోమీటర్లు నడిపించి వారు ఆనందించిన ఎంతసేపు నిలవలేదని అన్నారు. ఈ ఘటనతో రాష్ట్రంలోని ప్రజలందరూ తెలుగుదేశం పార్టీ దిని అధికారంలోకి తేవాలని కంకణం కట్టుకున్నారు. ఆరోజు చంద్రబాబు నాయుడు పర్యటన అడ్డుకోవడానికి అప్పటి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ఏ విధంగా వైఫల్యం చెందారో ప్రజలకు తెలియజేయాలని ఈ కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. డాక్టర్ గారి పుణ్యమా అంటూ ఈ నియోజకవర్గంలోని జరిగిన సత్య ప్రమాణాలు కానీ, తనును అరెస్టు చేయించడం వంటి సంఘటనలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి
కుతుకులూరు సర్పంచ్ హేమ తులసి, కర్రి వెంకటరామారెడ్డి, కరి వెంకన్న బాబు ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విలేకరిపై దాడి హేయమైన చర్య.



**రాజవొమ్మంగి: పెన్ పవర్ ఫిబ్రవరి 17:**పార్వతీపురం మన్యం జిల్లాలో మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడి చేయడం హేయమైన చర్య అని మండల ప్రెస్ క్లబ్ నాయకులు అన్నారు. విలేఖరి పై దాడిని ఖండిస్తూ సోమవారం రాజవొమ్మంగి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తాహాశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి డిప్యూటీ తాహాశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రెస్ క్లబ్ నాయకులు మాట్లాడుతూ. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పాత్రికేయులు ఏ సూరిబాబు,యూ ఉదయభాను,పి రామరాజు,జి బాలరాజు, కె శివ,ఈ శ్రీను,కె శ్రీను, లక్ష్మణ్,పి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.
ఫోటో రైటాప్..డిప్యూటీ తాహాశీల్దార్ కు వినతిపత్రం ఇస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు.

## హెల్మెట్‌తో ప్రాణానికి రక్ష




**పెద్దాపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, ఇది ప్రాణానికి రక్షణగా నిలుస్తుందని పెద్దాపురం ఎస్ఐ వి. మౌనిక అన్నారు. హెల్మెట్ వినియోగంపై పట్టణంలోని కళాశాల విద్యార్థులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడకం వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునని తెలిపారు. ప్రత్యేకించి యువత అతివేగంగా, ఫోన్లలో మాట్లాడుతూ వెళ్లడం వంటి కారణాలతో ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని వివరించారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, అలా ఇవ్వడం చట్టరీత్యా నేరమని గుర్తుచేశారు. అదేవిధంగా వాహనదారులు రహదారి నియమాల పట్ల అవగాహన కలిగి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బాధ్యతగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ ర్యాలీలో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కోళ్ల వ్యర్థాల్లో కాసుల వేట.. తొలగని కాలుష్యం ముప్పు

**నగరపాలక సంస్థ పరిధిలో కోడి మాంసం గడ్డలతో ముప్పు పొంచి ఉండటంతో ఆందోళన వ్యక్తమౌతోంది. వైకాపా పాలనలో కోళ్ల వ్యర్థాల్లోనూ ఆ పార్టీ నేతలకు కాసులు పంట పండింది. ఉమ్మడి గాజువాకటి జిల్లాలోని ఏలూరు,భీమవరం నగర పాలికలతో పాటు, కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల్లో చేపల చెరువులు విస్తరించి ఉన్నాయి. నగర పాలికలతో పాటు గ్రామీణ ప్రాంతాల చికెన్ సెంటర్ల నుండి నేరుగా సేకరించి చట్ట విరుద్ధంగా చేపల చెరువులకు తరలించారు. ఈ దందా నేటికీ కొనసాగుతూ వారం వారం తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**



**ఏలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 17 :** కోస్తా జిల్లాల్లో బర్డ్ ఫ్లూ ( హెచ్ ఎన్-1) వైరస్ లక్షణాలతో లక్షల్ల సంఖ్యలో కోళ్ల ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయి. కోడి మాంసం వ్యర్థాలతో కాలుష్యం పొంచి ఉండడంతో కోళ్ల ఫారాలకు కిలోమీటర్ దూరంలో ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించి ఆంక్షలు విధించినా చికెన్ సెంటర్లలో, మటన్ షాపులలో యదేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు.
కొల్లేరు ఆనుకుని ఉన్న ఏలూరు, భీమవరం జిల్లాల్లో చేపల చెరువులు అధికంగా ఉన్నాయి. వీటిలోని చేపలకు వినియోగించే కోళ్ల వ్యర్థాలకు మంచి గిరాకీ ఉంది. ఈ జిల్లాలోని ఇతర పౌరపాలికల్లో ప్రతిరోజు సాధారణ రోజుల్లో మూడు టన్నులు, ఆదివారాలు, పండుగ సమయాల్లో 10 టన్నుల వరకు వ్యర్థాలు సమకూరుతుంటాయి. పైగా చేపల చెరువుల యజమానుల మధ్య పోటీ ఉండడంతో నేతల కన్ను పడింది. మామూళ్ల కింద రూ.కోట్లు దండుకుంటున్నారు.

**సేకరణ ఇలా**

దుకాణాల నుంచి వ్యర్థాలు సేకరించేందుకు నగర, పుర పాలికాలకు నామమాత్రపు రుసుము కూడా చెల్లించుట లేదు. భారీ వాహనాల లో తరలిస్తున్నా పట్టించుకునే నాధుడు లేదు. నగర, పురపాలక అధికారులకు ఆయా ప్రాంతాల పరిధిలో ఎన్ని చికెన్ సెంటర్లు, మటన్ సెంటర్లు ఉన్నాయన్న దానిపై పరిశీలన లేదు. తరలింపు దారులను నయానా భయానా దారికి తెచ్చుకున్న వైకాపా నేతలు రూ.లక్షలు దండుకుంటున్నారు. అప్పట్లో తరలింపు దారులను వైకాపా నేతలు బెదిరించిన ఘటనలు ఉన్నాయి.

**వాస్తవానికి టెండర్లు పిలిచి..**

గత ఏడాది ఆగస్టులో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ గా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించాక నగరంలో మాంసం విక్రయ స్టాళ్ళ నుంచి వ్యర్థాలు చేపల చెరువులకు తరలించే వారిపై దృష్టి సారించి కట్టడి చేశారు. టెండర్లు పిలిచి, టెండర్లు దక్కించుకున్న వారికి మాత్రమే వ్యర్థాలు అప్పగించేలా చర్యలు తీసుకున్నారు. సేకరించిన వ్యర్థాలను గుత్తేదారులు శాస్త్రీయ విధానంలో శాస్త్రీయ విధానంలో రీసైక్లింగ్ చేసే రెండరింగ్ ప్లాంట్ కు మాత్రమే తరలించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు చికెన్ మటన్ స్టాళ్ళ యజమానులకు నోటీసులు ఇచ్చారు. కోళ్ల వ్యర్థాల సేకరణకు టెండర్లు పిలిచి గుత్తేదారులు మాత్రమే తీసుకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలి. అయితే గత ప్రభుత్వ హయాంలో అలాంటి చర్యలు లేకపోవడం, ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ను గెలిపించండి

**జనసేన జగ్గంపేట ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్**



**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సోమవారం జగ్గంపేట టౌన్ లో జనసేన జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ప్రచారం నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కు గ్రాడ్యుయేట్స్ మొదటి ప్రాధాన్యతను ఓటుని వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలు సూరంపాలెం, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, సురపురెడ్డి నరేష్, అడబాల వీరబాబు, స్వామి, శృంగరాయునిపాలెం నాగు, రేవూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## టీచర్ల నియామకం, నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం

**వై రామవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** మండల కేంద్రమైన వైరామవరంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, నూతనంగా భవనాలు నిర్మించుటకు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి జనసేన నాయకులు లిఖిత పూర్వకంగా సోమవారం ఫిర్యాదు చేశారు.

గతంలో ఈ ఉన్నత పాఠశాలకు అన్ని సౌకర్యాలు ఉండేవని, ప్రస్తుతం పాఠశాల భవనాలు జీర్ణస్థితిలో ఉన్నాయని, నూతనంగా భవనాలు నిర్మించి పూర్వ వైభవం తీసుకురావాలని జనసేన నాయకులు ఎమ్మెల్యేను కోరారు. గతంలో పలువురు విద్యార్థులు ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో సానుకూలంగా స్పందించారని, సమస్య పరిష్కరించుటకు తనవంతు సహాయ సహకారాలు చేస్తానని ఆమె తెలిపారని జనసేన మండల అధ్యక్షుడు ఆర్. పుష్పరాజ్ తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జనసేన పార్టీ సభ్యులు బాబురావు, దుర్గ, కుప్పాల జయరాం తదితరులు ఉన్నారు.




## రైతుల సమక్షంలోనే రీ సర్వే పనులు నిర్వహించాలి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,ఫిబ్రవరి 17:**రీ సర్వే పనులు వేగవంతం చేసి, రైతులు సమక్షంలోనే రీ సర్వే పనులను నిర్వహించాలని పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.
సోమవారం తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో రికార్డుల ప్రకారం జరుగుచున్న రీ సర్వే గ్రౌండ్ ట్రూతినింగ్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రైతులతో మాట్లాడి రీ సర్వే పై వారికి అవగాహన కల్పించారు. రైతులు అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. అధికారులు ముందుగా నోటీసులు అందజేస్తున్నారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే పనులు ఎలా జరుగుతున్నాయని అడిగి, అధికారులకు పలు సూచనలు చేశారు. రీ సర్వే కు సంబంధించి ఇప్పటివరకు రైతులకు స్వయంగా ఎన్ని నోటీసులు ఇచ్చారు, పోస్ట్ ద్వారా ఎన్ని పంపించారు అని విచారించి, పంపిన నోటీసుల వివరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. నోటీసులు అందజేసి నప్పటికీ గ్రామంలో ఆరుగురు
రైతులు రావడంలేదని గ్రామ సర్వేయర్ జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే జేసి స్పందిస్తూ రీ సర్వేకు హాజరు కానీ ఆరుగురు రైతులను పిలిచి మాట్లాడి, సర్వే పనులు పూర్తయ్యేలా చూడాలని ఆర్డిఓ, తాహసిల్దార్ ను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అధికారులు ముందుగా రైతులకు నోటీసులు అందజేసి వారి సమక్షంలో రీసర్వే పనులను చేయాలని, భూ యజమానులకు తెలియకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వే పనులు చేయరాదని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భూమి విషయంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ముందుగా అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా సర్వే అధికారి కె.జాషువా తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్, మండల సర్వే అధికారి, సర్వే డిటి, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్ లు, రైతులు, తదితరులు ఉన్నారు.

## ఓటర్ల స్లిప్పులు సక్రమంగా పంపిణీ చేయాలి-అజయ్ బాబు



**గోపాలపురం,పెన్ పవర్ ఫిబ్రవరి 17 :**మండలంలోని ఈ నెల 27వ తేదీన జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు స్లిప్పులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసిల్దార్ కే.అజయ్ బాబు సిబ్బందికి ఆదేశించారు.సోమవారం స్థానిక కార్యాలయంలో ఓటర్ స్లిప్పులను ఇబ్బందికి అందజేస్తారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడానికి అందరి యొక్క సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు.ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు.ఎక్కడ ఇటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.గ్రామాల్లో ఉన్న ఓటర్లు అందరికీ ఓటర్ స్లిప్పులు సకాలంలో అందించాలన్నారు.ఆ బాధ్యత వీఆర్వో,బిఎల్ఓ లదే అని అన్నారు.ఈ సందర్భంగా తహసిల్దార్ అజయ్ బాబు,ఎలక్షన్ డిటి వి.సాంబశివరావు, సీనియర్ అసిస్టెంట్ కె.నల్లరాజులు అందజేశారు.

## రికార్డులు పరిశీలించిన జె.సి.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,ఫిబ్రవరి 17:**స్థానిక ఆర్డిఓ కార్యాలయంలోని రికార్డులను పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. సోమవారం ఆయన ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో జరుగుచున్న
రీ సర్వే పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన జెసి తాడేపల్లిగూడెం ఆర్డిఓ కార్యాలయం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చాంబర్లో ఆర్డిఓ, జిల్లా సర్వే అధికారి, తహసిల్దార్ సమక్షంలో గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించాల్సిన కో రిలేషన్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామ సభల్లో స్వీకరించిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. వివిధ రెవెన్యూ అంశాలకు సంబంధించిన పనులను పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను సిబ్బందిని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా సర్వే అధికారి కె .జాషువా, తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# నందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధలకు భోజనాలు పంపిణీ





**తాళ్ళపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**పైడిమెట్ట గ్రామానికి చెందిన నందన ఫౌండేషన్ సభ్యులు దేవరపల్లి రవి కుమార్తె నందన శ్రావ్య పుట్టినరోజు సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో నందన చదివే సెయింట్ యూజీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, స్నేహితులతో కలిసి కేక్ కటింగ్ చేయడం జరిగింది. నందనకు కార్యక్రమంలో పాల్గొన్న వారు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తాళ్లపూడిలో కొంతమంది అనాదలకు, యాచకులకు భోజనాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ పాల్గొన్నారు.

## తునిలో కూటమి ప్రభుత్వం దౌర్జన్యం దారుణం.

- మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పై దాడి అత్యంత హేయమైన చర్య
- కూటమి ప్రభుత్వ దుర్మార్గాలను అడ్డుకుంటాం.
- ప్రత్తిపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు.తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో ఆయా పార్టీ శ్రేణులు వ్యవరించిన తీరు అందుకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు.తునిలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పై జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య అన్నారు.
మంత్రిగా పనిచేసిన దాడిశెట్టి రాజా పై పోలీసులు సమక్షంలో కూటమి నేతలు బరితెగించి దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి పద్ధతి కాదన్నారు
వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా దాడిశెట్టి రాజా కి పోలీసులు రక్షణ కల్పించవలసింది పోయి కూటమినేతలకు అండగా నిలువడం సిగ్గు చేటన్నారు.
పోలీసులు సాయంతో కౌన్సిలర్లను ఎత్తుకుపోయే కార్యక్రమం చేయడం అతి దారుణమని ఈ సందర్భంగా దుయ్యాబట్టారు.మున్సిపల్ ఛైర్మన్ ఇంటిలో ఉన్న వైయస్సార్సీపీ కౌన్సిలర్లను తీవ్ర భయభ్రాంతులకు గురి చేయడంలో పాటు, మున్సిపల్ ఛైర్మన్ ఇంటి చుట్టూ ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి.. విధ్వంసాన్ని సృష్టించడం దీనికి పోలీసులు అండగా నిలవడం దురదృష్టకరమన్నారు.
ప్రజాస్వామ్య పరిరక్షకులమని కబుర్లు చెబుతున్న కూటమి నేతలు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక కోసం ఇంత దారుణంగా తెగబడ్డం చూస్తుంటే రాష్ట్రంలో అసలు రాజ్యాంగం పని చేస్తుందా లేక,
టీడీపీ నేతలు కొత్తగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు.
ఇదే పరిస్థితి కొనసాగితే కచ్చితంగా వైయస్సార్సీపీ శ్రేణులతో కలసి తుని తరలి వెళ్లి టీడీపీ దుర్మార్గాలను అడ్డుకుంటామని గిరిబాబు హెచ్చరించారు.
తునిలో జరుగుతున్న పరిణామాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్వయంగా వెళ్లి ఎన్నికలను పర్యవేక్షించడమేకాకుండా,
అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పోలీస్ అధికారుల మీద చర్యలు తీసుకోవాలని గిరిబాబు డిమాండ్ చేసారు.

## కొండుకుదురు లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి



**అమలాపురం రూరల్, పెన్ పవర్,ఫిబ్రవరి 17:**గ్రాడ్యుయేట్ ఎన్ డి ఏ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ఇంటింటికి ప్రచారంలో భాగంగా భాగంగా అయినవిల్లి మండలం కొండుకుదురు మరియు ఇతర గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారం లో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డోర్ టు డోర్ ఎన్నికల ప్రచారం అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామంలో జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బలపరిచిన మన ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కి మీ మొదట ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలల లోనే ఇంతటి అభివృద్ధి చేయగలిగింది. త్వరలోనే మిగిలిన హామీలన్నీ నెరవేరుస్తామని అన్నారు. ఈ యొక్క ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పోలిశెట్టి రాజేష్ , రాష్ట్ర సర్పంచుల సమైక్య కార్యదర్శి సలాది బుచ్చిరాజు, కుప్పల రాంబాబు, జనసేన తెలుగుదేశం భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు ,నాయకులు, గ్రామ అధ్యక్షులు ,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కే రాణి**



**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**రాష్ట్రంలో అంగన్వాడి ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కే రాణి డిమాండ్ చేశారు. అంగన్వాడీ ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కార్యదర్శి రాణి మాట్లాడుతూ అంగన్వాడీల కనీస వేతనాలను 26 వేల రూపాయలకు పెంచాలని అలాగే గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంట్రల్ గా అప్డేట్ చేయాలని అన్నారు. అంగన్వాడి సెంటర్ల నిర్వహణకు అంగన్వాడీలే సొంతంగా రకరకాల పెట్టుబడులు పెట్టి కేంద్రాలను నిర్వహించవలసి వస్తుందన్నారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం కోసం 42 రోజులపాటు సమ్మె నిర్వహించగా ప్రభుత్వం 2024 జూలైలో వేతనాలు పెంచుతామని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు పరిష్కారం కాలేదన్నారు. అంగన్వాడి లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని ,సర్వీస్ లో ఉండి చనిపోయిన వారి దహన సంస్కారాలకు 20 వేల రూపాయల మంజూరు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు ఉచితంగా గ్యాస్ సర్ప్లైజ్ చేయాలని వేతనంతో కూడిన మెడికల్ లెవెల్ కనీసం మూడు నెలలు ఇవ్వాలని ఫ్రీ స్కూల్ పిల్లలకు తల్లి వందనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగదేవి, వెంకయ్యమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేద్దాం



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**ఉభయగోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పినపళ్ళ కూటమి నేతలు పిలుపునిచ్చారు. సోమవారం గ్రాడ్యుయేట్లను కలుసుకొని ఓటును అభ్యర్థించారు. గతంలో గెలిచినవారు గ్రాడ్యుయేట్ల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని పేరాబత్తుల రాజశేఖర్ గ్రాడ్యుయేట్ల సమస్యలను శాసనమండలిలో వినిపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తారని సర్పంచ్ సంగీత సుభాష్ అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పేరా బత్తుల రాజశేఖర్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఏఎంసీ మాజీ ఛైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి రామన్న, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్యవాడలో వీరభద్రుని సంబరం పాల్గొన్న మంత్రి సుభాష్.



**కె గంగవరం పెన్ పవర్ ఫిబ్రవరి 17:** కె గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో వీరన్నబాబు స్వామి ఆలయంలో వీరభద్రుని సంబరం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ వీరభద్ర సంబరంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వీరన్నబాబు స్వామి ఆలయం నుండి వీరభద్రుని తీసుకుని బాజాభజంత్రీలతో జమ్మిచెట్టు వద్దకు వెళ్లి అక్కడ జంగమదేవర తో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరభద్రుని తీసుకుని ఆలయం వద్దకు వచ్చి వీరభద్రుని ఆలయంలో విచ్చేస్తారు. వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు సాయంత్రం ఏడు గంటలకు వీరభద్ర సంబరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవాడ చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# గంజాయి జోలికి వెళ్లొద్దు




అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**గంజాయి రవాణా వాడకం జోలికి యువత వెళ్లొద్దని అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి, గంగవరం ఎస్సై వెంకటేష్ సూచించారు. సోమవారం మండలంలోని ఈ రామవరం లో ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజే వాళ్ళని కలిగే దుష్పరిణామాలను వివరించారు .గంజాయి మత్తుకు యువత బానిస కావద్దని సూచించారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్, లోన్ యాప్స్ వంటి బారిన పడవద్దని సూచించారు. ఎవరికి ఓటిపి షేర్ చేయవద్దని ,మద్యం తాగి వాహనాలు నడపరాదని, వాహనాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గంగవరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐఎల్ఏ అధ్యక్షుడిగా న్యాయవాది టి.పృథ్వీరాజ్



**కాజులూరు,పెన్‌పవర్,ఫిబ్రవరి17:**ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ( ఐఎల్ఏ ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాది టీ పృథ్వీరాజ్,ఉపాధ్యక్షుడు కోలా శ్రీహరి రావు, ట్రెజరర్ జేవి రమణలను కాకినాడ బార్ అసోసియేషన్ హాల్లో సోమవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముత్తూంటి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఐ ఎల్ ఏ చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు.ప్రధాన కార్యదర్శి చెక్క శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించేందుకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పేపకాయల రామకృష్ణ మాట్లాడుతూ ఐ ఎల్ ఏ సామాజిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడమే కాకుండా, చట్టాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన అశోక్కుమార్ ను బార్ అసోసియేషన్ సత్కరించింది. న్యాయవాదుల సమస్యలే కాకుండా ప్రజల సమస్యలపై కూడా పోడేందుకు కృషిచేయడం జరుగుతుందని ఐఎల్ఏ అధ్యక్షులు టి.పృథ్వీరాజ్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఐ ఎల్ ఏ రాష్ట్ర కార్యదర్శి వడ్డీ శ్రీనివాస్ బాబు,సీనియర్ న్యాయవాదులు అవసరాల నాగరాజు, వార రాజబాబు కంబాల శ్రీధర్ డియల్ నరసింహారావు,పెదగాడి వెంకటరమణ, యనమల రామం,సయ్యద్ సాలార్, మంగా వెంకట శివరామకృష్ణ తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## అంగరంగ వైభవంగా ఆరంభమైన బ్రహ్మోత్సవాలు



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**చింతలూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ద్వితీయ వార్షిక పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. ప్రాత:కాలం నుంచే వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో పవిత్రోత్సవం, ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అభిషేకాన్ని తిలకించి భక్తి తన్మయత్వంలో ఓలలాడారు. సాయంత్రం స్వామివారు శేష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు.

## చింతలూరు లో భక్తజన కోలాహలం

- బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన అశేష జనం



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 17:**శేష వాహనంపై ఊరేగిన శ్రీవారు నిత్య వైకుంఠ ద్వార క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన చింతలూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ద్వితీయ వార్షిక పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రాత: కాలం నుంచే స్వామివారికి విశేష పూజలు అర్చనలు నిర్వహించారు. ఉదయం ధ్వజారోహణ, ధృవమూర్తికి పంచామృతాభిషేకం, సుదర్శన యాగం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను శేష వాహనంపై వేంచేపు చేసి ఊరేగింపు నిర్వహించారు. చింతలూరు ప్రధాన వీధులతో పాటు జొన్నాడ కాకినాడ ప్రధాన రహదారిపై కొత్తూరు సెంటర్ మీదుగా జరిగిన రథోత్సవం భక్తజన కోలాహలంతో ఆద్యంతం కన్నుల పండుగ గా జరిగింది. భక్తులు గోవింద నామ స్మరణతో స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహక బృందం చల్లని మజ్జిగ, మంచినీరు తదితర ఏర్పాట్లు చేశారు.

# ఈ నెల 23న శ్రీ ధనధాన్య లక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ.

**కె గంగవరం పెన్ పవర్ ఫిబ్రవరి 17:**కె గంగవరం మండలం కోటిపల్లి నుంచి కె గంగవరం మెయిన్ రోడ్ లో కొత్తకోట వద్ద శ్రీ ధనధాన్యలక్ష్మి అమ్మ వారి నూతన ఆలయం అంగరంగ వైభవంగా నిర్మించారు. ఈ నెల 23న శ్రీ ధన ధాన్యలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహిస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.సోమవారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నేమాని సత్తిబాబు దంపతులు,ఎంపీపీ పంప్పన నాగమణి సుబ్బారావు దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



## కూటమి అభ్యర్థి పేరాబత్తుల

# గెలుపే లక్ష్యం : మాజీ ఎమ్మెల్సీ అంగర

**గుండుగోలనులో పట్టభద్రుల ఎన్నికల ప్రచారం**

**పెనుమంట్ర, (పోడూరు) పెన్ పవర్, ఫిబ్రవరి -17 :** టిడిపి, జనసేన, భాజపా ( ఎన్డీఏ ) కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలిపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో పనిచేయడం, ప్రజల నుంచి విశేష ఆదరణ లభించడం ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్అన్నారు. భీమడోలు మండలం గుండుగొలను లో సచివాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ ను ఎంపిక చేయడం జరిగిందన్నారు. వైసీపీ అరాచక పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలు ఎలా పట్ట కట్టారో ఆ ప్రకారమే రాజశేఖర్ గెలుపు తథ్యం అన్నారు. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు ఓటర్ల నుంచి విశేషాదరణ లభిస్తుందన్నారు. ఓటర్లు ఎన్డీఏ కూటమి అభ్యర్థికే విజయాన్ని అందిస్తారని జోష్యం పలికారు.



## సెయింటెన్స్ ప్రయివేట్ స్కూల్ ఘటన పై ప్రత్యేక అధికారి తో ధర్యప్తు చేయాలి.

- పీసా కమిటీ పాడేరు ఉపాధ్యక్షులు సల్ల రామకృష్ణ డిమాండ్.





**పాడేరు,పెన్ పవర్ ఫిబ్రవరి 17.** అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో గత నెల పాడేరు గోందూరు సెయింట్ ఆన్స్ పాఠశాలకు సంబంధించిన హాస్టల్ లో 7 వ తరగతి విద్యార్థిని పై అదే వసతి గృహం లో 10 వ తరగతి చదువుతున్న ముగ్గురు సీనియర్ విద్యార్థులు దాడి చేసిన విషయాన్ని వివిధ సోషల్ మీడియా వచ్చిన విషయం పై పెస చట్టం పాడేరు ఉపాధ్యక్షులు సల్ల రామక్రిష్ణ,కార్యదర్శి కిల్లు రాధాకృష్ణ నాయుడు స్కూల్ సిబంధితో ప్రిన్సిపల్ సిస్టర్ సినా,కరోస్పాండంట్ సిస్టర్ మ్యారీ తౌమస్ మరియు సిబందితో జరిగిన ఘటన పై విచారణ చేశారు విచారణ లో సిస్టర్ క్షమాపణ కోరుతూ, జరిగిన విషయం చాలా బాధాకరం అన్ని తెలియజేస్తూ,వార్డెన్ కేర్ టేకర్ స్వరూప ని డిస్మిస్ చేశామని ప్రిన్సిపల్ తెలిపారని అన్నారు. పెస చట్టం ప్రతినిధులు విచారణలో స్కూల్ లో బాలురు బాలికలు మొత్తం 1445.మంది పిల్లలు,టీచర్స్ 57,నాన్ టీచింగ్ స్టాఫ్ 4 మంది హెల్పర్స్ 4 మంది ఉన్నారు, హాస్టల్ లో 29 మంది ఉంటున్నారు కాని హాస్టల్ లో ఉంటున్న విద్యార్థులు రుసుము ప్రతి నెల 3000 రూపాయలు తీసుకుంటునట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు,వీటి పైన శాఖపరమైన చర్యలు తీసుకోవాలిని అలాగే జరిగిన ఘటన పై ఐటీడీఏ పీ.వో అభిషేక్ గౌడ్ ను కలసి జరిగిన విషయాన్ని చర్చించడం జరిగింది,పీవో అభిషేక్ గౌడ్ వివరణ లో ఇటువంటి సంఘటనలు ఇక్కపై జరగకుంట చూసుకుంటూ, ఆఫీసర్స్ తో కమిటీ ఫామ్ చేస్తామని తెలియజేశారు కమిటీ లో విధి విధానాలు తయారు చేసి మిషనర్స్ స్కూల్స్ పనీతీరు పర్యవేక్షిస్తామని పీవో తెలిపారు,ఈ కార్యక్రమంలో పెస ప్రతినిధులు సల్ల రామకృష్ణ,కిల్లు రాధాకృష్ణ నాయుడు,కొట్టగుల్లి సింహాచలం నాయుడు, వందేమాతరం శ్రీను అన్న. వెంకీ మాస్టర్.లాయర్ తామర్భ ప్రసాద్ నాయుడు,సిబంది పాల్గున్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి



**కురుపాం / పెన్ పవర్. ఫిబ్రవరి 17, సీతంపేట,పాలకొండ:** ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, రీ సర్వే కార్యక్రమం పక్కాగా జరగాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక అధికారులను ఆదేశించారు. సోమవారం సీతంపేట, పాలకొండ మండలాలోని తహసీల్దారు కార్యాలయాలను పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన రికార్డులను భద్రపరిచే విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి జాయింట్ కలెక్టర్ సూచించారు. రీ సర్వేలో ఎటువంటి అవకతవకలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రికార్డులను, కంప్యూటర్ గదులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై తహశీల్దార్లతో చర్చించారు. చౌక్ డిపోలకు సక్రమంగా బియ్యాన్ని సరఫరా చేయాలని స్టాక్ పాయింట్ అధికారిని జెసి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సీతంపేట, పాలకొండ తాహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విలేకరులపై దాడులు కరెక్ట్ కాదు



- దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
- సర్వస్వం త్యాగం చేసి సమాజం కోసం పనిచేసే విలేకరులపై బెదిరింపులు తగదు
- వ్యతిరేక వార్తలు రాస్తే ప్రజాస్వామ్య బద్ధంగా ఖండించాలి తప్ప దాడులు సరికాదు
- ఫోర్త్ ఎస్టేట్ గొంతు నొక్కాలనుకోవడం మూర?త్వమే
- ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు జర్నలిజం పై దాడులు చేయకుండా క్యాడర్ ను అదుపులో ఉంచాలి
- కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్వతీపురం జర్నలిస్ట్ ఫోరం ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, ఫిబ్రవరి- 17,** జర్నలిస్టులపై దాడులు కరెక్ట్ కాదని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్వతీపురం జర్నలిస్ట్ ఫోరం ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు అన్నారు. మక్కువ ప్రజాశక్తి విలేఖరి రామారావుపై టిడిపి నాయకుడి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగంలో ఫోర్త్ ఎస్టేట్ గా పేర్కొన్న జర్నలిజం గొంతు నొక్కాలనుకోవడం మూర?త్వమే అన్నారు. విలేకరులపై భౌతిక దాడులు, బెదిరింపులకు పాల్పడిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు. కూటమి పాలన వచ్చాక జిల్లాలో జర్నలిస్టులకు బెదిరింపులు ఎక్కువయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు దీనిపై దృష్టి సారించి క్యాడర్ ను అదుపులో ఉంచాలన్నారు. ప్రజాస్వామ్య మనుగడకు మూలాధారమైన పత్రికా వ్యవస్థపై దాడి సమంజసం కాదని అన్నారు. వ్యతిరేక వార్తలు రాసినప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా దానికి వివరణ ఇవ్వాలని, లేదా ప్రకటన ద్వారా ఖండించాలన్నారు. లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకోవాలి తప్ప భౌతిక దాడులు సరైన మార్గం కాదని అన్నారు. ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటివని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకునేటప్పుడు చట్టం మేల్కొని, అవతలి వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం శిక్షించాలన్నారు. ఆదాయం లేకపోయినా కుటుంబాలను పక్కనపెట్టి రాత్రి పగలు, ఎండా వాన అనకుండా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే విలేకరులపై దాడులు ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. తక్షణమే దాడి చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తగు చర్యలు చేసుకోవాలని కోరారు.

## బహుజన అధికారులపై కక్ష సాధింపు చర్యలు చేస్తే సహించం

బహుజన నాయకులు బొట్టా నాగరాజు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 17) :**రాష్ట్రంలో బహుజన అధికారులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపడితే ఊరుకునేది లేదని బహుజన ఐక్యవేదిక నాయకులు బొట్టా నాగరాజు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం బి.ఐ.వి. కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు బహుజన అధికారులు అయిన మాజీ సిఐడి చీఫ్, ఐపీఎస్ అధికారి పి.వి.సునీల్ కుమార్ పై కక్షగట్టి, అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇప్పటికీ ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. అట్టడుగు వర్గాల సమాజం బాగుపడాలని నిరంతరం వారు బాగుకై అహర్నిశలు కృషి చేస్తున్న పి.వి. సునీల్ కుమార్ పై కక్షగట్టి ఇబ్బందులు పెట్టడం సరికాదని, అధికారులు రాజ్యాంగానికి లోబడి ఉద్యోగాలు చేస్తారని, అలాంటివారిని ఇబ్బందులు పెడితే రాజ్యాంగాన్ని వ్యతిరేకించినట్టేనన్నారు. పీవి సునీల్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఉత్తమ పోలీస్ అధికారిగా ఎన్నో అవార్డులు అందుకున్నారని అన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించి ఆయనపై కక్ష సాధింపు చర్యలు ఆపి, పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బహుజనులుగా రాష్ట్రవ్యాప్తంగా పోరాడుతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అలాగే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు దళిత బహుజన అధికారులన్నా, ప్రజలన్న చులకన భావం ఉందని, ఇదే ధోరణి కొనసాగిస్తే రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక నాయకులు ఎన్.చిరంజీవి, వి.సంజీవ్, కొల్లు గంగాధర్ పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ కో.కన్వీనర్గా బాధ్యతలు చేపట్టిన కాంగు శుభ.





విజయవాడలో జరిగిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ వేదికగా (సీఆర్పీఎఫ్ ) నూతన కార్యవర్గ సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్పీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు (కో.కన్వీనర్) గా ఎన్నుకోబడిన కాంగు శుభ. ఆమె పత్రిక సమావేశంలో మాట్లాడుతూ గిరిజన గ్రామంలో చాలామంది చిన్న పిల్లలు అతి తక్కువ వయసులో గంజాయికి మత్తు పదార్థాలకి బానిసలు అవుతున్నారు ఏజెన్సీలో ఇకపై అలాంటి మత్తు పదార్థాలు కి బానిసలు కాకుండా చూస్తానని నా ఈ వృత్తికి న్యాయం చేస్తానని ఆమె తెలిపారు.

## సెయింటెన్స్ ప్రయివేట్ స్కూల్ ఘటన పై ప్రత్యేక అధికారి తో ధర్యప్తు చేయాలి.

**రాష్ట్ర హ్యూమన్ వింగ్ కాంగు శుభ డిమాండ్ చేశారు.**

**పాడేరు,పెన్ పవర్ ఫిబ్రవరి 17.**అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో గత నెల పాడేరు గోందూరు సెయింట్ ఆన్స్ పాఠశాలకు సంబంధించిన హాస్టల్ లో 7 వ తరగతి విద్యార్థిని పై అదే వసతి గృహం లో 10 వ తరగతి చదువుతున్న ముగ్గురు సీనియర్ విద్యార్థులు దాడి చేసిన విషయాన్ని వివిధ సోషల్ మీడియా వచ్చిన విషయం పై ఆమె తీవ్రంగా మండిపడ్డారు.ఈ ఘటనపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలిని ఆమె డిమాండ్ చేశారు.



## మంచినీటి సౌకర్యం కల్పించాలని వినతిపత్రం ఇచ్చిన కొరడగూడ గ్రామస్తులు.



**గుమ్మ లక్ష్మీపురం ఫిబ్రవరి 17, పెన్ పవర్ : గుమ్మలక్ష్మీపురం** మండలం లో గల దుమ్మంగి పంచాయతీ పరిధిలో ఉన్న కొరడగూడ గ్రామస్తులు మంచినీటి సౌకర్యం కల్పించాలని సోమవారం నాడు ప్రభుత్వ విప్ %డ% కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి వినతిపత్రం ఇచ్చారు.

ఈ మేరకు గ్రామంలో సుమారుగా 25 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, మంచినీటి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే గారికి విన్నవించారు.

ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని చెప్పడం జరిగింది. అంతేకాకుండా ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## విజయ్ గౌరి విజయానికి ఇంటింటా ప్రచారం

**పద్మనాభం.పెన్ పవర్, ఫిబ్రవరి 17 :**మండలంలోని ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరీ విజయానికి ప్రచార కార్య క్రమాన్ని పలు ప్రజాసంఘాల నాయకులు ఉపా ధ్యాయులు ఇంటింటా కార్యక్రమాన్ని నిర్వ హించారు దీనిలో భాగంగా ఆదివా రం విలాస్ ఖాన్ పాలెం గ్రామంలో జరిగిన ఒక పెళ్లి వేడు కలో అక్కడికి వచ్చిన ఉపాధ్యాయులను కూడా అజయ్ శర్మ. దాసరి నాగేశ్వరరావు. కే సన్యాసి రావు. అంబేద్కర్. బి సన్యాసినాయుడు. వేడు కల్లో ఉన్న ఉపాధ్యాయులను కూడా కలిసి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.



## బాలల హక్కుల పరిరక్షణ కో. కన్వీనర్ బాధ్యతలు చేపట్టిన కాంగు శుభ.

**పెన్ పవర్ (ఫిబ్రవరి 17)**విజయవాడలో జరిగిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ వేదికగా (సీఆర్పీఎఫ్ ) నూతన కార్యవర్గ సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్పీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు (కో.కన్వీనర్) గా ఎన్నుకోబడిన కాంగు శుభ. ఆమె పత్రిక సమావేశంలో మాట్లాడుతూ గిరిజన గ్రామంలో చాలామంది చిన్న పిల్లలు అతి తక్కువ వయసులో గంజాయికి మత్తు పదార్థాలకి బానిసలు అవుతున్నారు ఏజెన్సీలో ఇకపై అలాంటి మత్తు పదార్థాలు కి బానిసలు కాకుండా చూస్తానని నా ఈ వృత్తికి న్యాయం చేస్తానని ఆమె తెలిపారు.

## పాడేరు సెయింట్ అన్స్ స్కూల్ ఘటనపై ప్రత్యేక అధికారులతో విచారణ చేపట్టాలి

- జీకే విధి బిజెపి మండల అధ్యక్షుడు కాకూరు శేఖర్
- జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యం బాలు



గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 17: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో సెయింట్ అన్స్ పాఠశాల హాస్టల్లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై పదవ తరగతి చదువుతున్న ముగ్గురు సీనియర్లు దాడి చేసిన విషయాన్ని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సందర్భంగా దాడి చేసిన పదవ తరగతి విద్యార్థినిల పై చర్యలు తీసుకోవాలని, హాస్టల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్ సిబ్బంది, అధికారులు చర్యలు చేపట్టాలని గూడెం కొత్త వీధి మండల బిజెపి అధ్యక్షులు కాకూరు శేఖర్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కొయ్యం బాలు ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై అమానుషంగా ప్రవర్తించటం బాధాకరమని అన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో హాస్టల్లో నిర్వాహకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## రేణుకా మహంతి గుండెపోటుతో మరణం,

- జి.బి.ఎస్ వ్యాధి తో మరణించలేదని నిర్ధారణ
- కె.జి.హెచ్ సూపరింటెండెంట్ డా.పి. శివానంద్



విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 17. :కింగ్ జార్జ్ హాస్పిటల్ పేషెంట్ రేణుకా మహంతి మరణించినట్లు ప్రకటిస్తున్నాము.కింగ్ జార్జ్ హాస్పిటల్ కె.జి.హెచ్ లో 63 ఏళ్ల మహిళా రోగి రేణుకా మహంతి, మల్లివీడు గ్రామం,ఎల్. కోట మండలం, విజయనగరం జిల్లా వాస్తవ్యులు మ రణించినట్లు తెలియజేయడానికి చింతిస్తున్నా ము.రేణుకా మహంతిని ఫిబ్రవరి 6, 2025 న, మధ్యాహ్నం 1:37 గంటలకు కింగ్ జార్జ్ హాస్పి టల్ జనరల్ మెడిసిన్ విభాగంలో చేర్చారు. ఆమెకు గుయిలెయిన్-బారే సిండ్రోమ్ జి.బి.ఎస్ అని అనుమానస్పదముగా ఆసుపత్రి నందు అ డ్మిట్ చేయబడింది, ఆమెకు మధుమేహం షుగ ర్, బ్లడ్ ప్రెషర్ ఉన్నాయి. వెంటనే ప్రామాణిక వైద్య ప్రోటోకాల్‌ల ప్రకారం చికిత్స అందించబ డింది. రెగ్యులర్ వైద్య పర్యవేక్షణలో ఆమె పరి స్థితి మెరుగుదల చూపించింది.సోమవారం ఉద యం 9 గంటలకు మెడికల్ సూపరింటెండెంట్ నిర్వహించిన వార్డ్రౌండ్స్ లో,రేణుకామ హం తి పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు అంచనా వేయబ డింది.విచారకరంగా,రేణుకా మహంతికి ఆక స్మికంగా తీవ్రమైన ఛాతీ నొప్పి వచ్చింది, తరు వాత కుప్పకూలిపోయింది. తీవ్రమైన కొరోనరీ ఆర్టరీ లోపం కారణంగా తీవ్రమైన మయోకార్డి యల్ ఇన్ఫార్క్షన్ గుండెపోటు అని తేలింది.వై ద్య మరియు నర్సింగ్ బృందాల యొక్క ఉత్తమ ప్రయత్నాలు చేసినప్పటికీ, రేణుకా మహంతిని కాపాడలేకపోయారు మరియు మరణించినట్లు ప్రకటించారు.మరణానికి ప్రధాన కారణం తీవ్ర మైన మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ గుండెపోట అని నిర్ధారించబడింది మరియు ఆమె జి.బి.ఎస్ వ్యాధి తో మరణించలేదని నిర్ధారించడమైనది.

## పాడేరు సెయింటేన్స్ పాఠశాల లో 7 వ తరగతి చదువుచున్న హాస్టల్ బాలిక పై 10 వ తరగతి విద్యార్థినిలు చేసిన భౌతికదాడి (రాగ్గింగ్ ) సంఘటన పై చర్యతీసుకున్న,

జిల్లా విద్యశాఖాదికారి,పి. బ్రహ్మాజీ రావు.





పాడేరు, పెన్ పవర్ పిబ్రవరి 17. అల్లూరి జిల్లా పాడేరు కేద్రం లో ప్రాజెక్ట్ అధికారి. జాయింట్ కలెక్టర్.డిప్యూటీ డైరెక్టరుకు(టి.డబ్ల్యు),(ఎం.ఇ.ఓ. సి.డి.పి.ఓ)లతో కమిటీ ఏర్పాటు చేసారు. కమిటీ సెయింటేన్స్ పాఠశాలను తనిఖీ చేసి హాస్టలు నిర్వహణకు అనుమతులు ఉన్నాయి లివ్ పరిశీలించారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలలో హాస్టల్ నిర్వహణకు, రాగ్గింగ్ కు సంభందించి (ఎస్.ఓ.పి) తయారుచేయాలి చెప్పారు. సంఘటన జరిగిన సెయింటేన్స్ హాస్టల్ వార్డెన్ ను విధుల నుంచి తొలగించరు. హాస్టలులో ఉన్న దాడికి పాల్పడిన 10 వ విద్యార్థినులను హాస్టల్లో కొనసాగనివ్వకుండా ఇంటికి పంపించేశారు. ప్రాజెక్ట్ అధికారి సమావేశమాలో సెయింటేన్స్ పాఠశాల హాస్టల్లో పూర్తి పర్యవేక్షణ పెంచాలని ఆదేశాలు జారి చేశారు భవిష్యత్తులో ఇంటువంటి సంఘటనలు పునరావృతము కాకూడదని గట్టిగా హెచ్చరించారు.భవిష్యత్మలో ఇటువంట సంఘటనలు పునరావృతము అయితే, జిల్లా యంత్రాంగము తీసుకొనబోయే చార్యలకు సదరు మేనేజ్ మేంట్ బాధ్యత వహించవలసి ఉంటుందని. జిల్లా విద్యశాఖాదికారి పి.బ్రహ్మాజీ రావు హెచ్చరించారు.

# నాతవరం మండలంలో కలెక్టర్ విజయ్ కృష్ణన్ సుడిగాలి పర్యటన....







నాతవరం పెన్ పవర్ (ఫిబ్రవరి 17): సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ నాతవరం మండలంలో పర్యటించారు.ముందుగా గాంధీనగరం పెడిమికొండ, రిజర్వ్ ఫారెస్ట్,సుందరకోట పంచాయతీ, కే.దద్దుగుల గ్యాప్ ఏరియా భూములను పరిశీలించారు.ఈ భూములు ఎస్ఈ జెడ్ కి అనుకూలంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు.వెంటనే సర్వే చేసి రిపోర్టు అందజేయాలని రెవెన్యూ అధికారులును కోరారు.అనంతరం అక్కడ గిరిజనులతో మాట్లాడి త్రాగునీరు,వైద్య సదుపాయం, విద్యా సదుపాయం జీవనాధారం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.వారు రోడ్డు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరారు.ఇటీవల అసనగిరికి జాతీయ ఉపాధి హామీ పథకంలో రోడ్డు వేసారని,ఈ రోడ్డు వర్షాకాలంలో పర్వత ప్రాంతాలను మీదుగా నీరు రోడ్డు మీదకు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.ఆమె వెంట నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి వివి.రమణ,నాతవరం తహసిల్దార్ ఎ.వేణుగోపాల్,ఎంపీడీవో కే.ఉషశ్రీ,ఎస్సై.సిహెచ్ భీమరాజు,సర్వేయర్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేసా చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



ఎంపీడీవో ఉమామహేశ్వరరావు






గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 17: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం ఎంపీడీవో కార్యాలయంలో పేసా చట్టంపై డ్వాక్రా సంఘం మహిళకు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులు ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎస్ హెచ్ జి సభ్యులకు నిర్వహించే శిక్షణా తరగతులలో పేసా చట్టం పై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతులలో పేసా చట్టం ఏ విధంగా రూపాంతరం చెందింది, దాని విధివిధానాలు గురించి వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈవో పి ఆర్ డి పాపారావు, ఏవో ఇమ్మానియేల్, సెక్రటరీలు అరుణ్ కుమార్, బాలకృష్ణ, వంచులా సెక్రెటరీ శివ, లక్కవరపుపేట సెక్రెటరీ వై. శ్రీను,ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళలు, వెలుగు ఏపీఎం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## కేన్సర్ మీద అవగాహన ర్యాలీ పింక్ సఖి సారీ వాక్




### సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ అందరికి క్యాన్సర్ పరీక్షలు

స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్, విశాఖపట్నం ఫిబ్రవరి 17. :రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డా.పద్మావతి వారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు వారి సమక్షంలో సుమారు 500 మంది ఆరోగ్య సిబ్బంది కలిసి కేన్సర్ మీద అవగాహన కల్పించుటకు విశాఖపట్నం ఆర్కే బీచ్ నుండి వైఎంసిఎ వరకు జరిగిన పింక్ సఖి సారీ వాక్ లో పాల్గొన్నారు. మరియు జుంబా డాన్స్, స్టేజి షో కూడా నిర్వహించారు.ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా సాధారణ న్.సి.డి ల నివారణ, నియంత్రణ మరియు స్క్రీనింగ్ కోసం జనాభా ఆధారిత స్క్రీనింగ్ ప్రోగ్రామ్, అంటే మధుమేహం, అధిక రక్తపోటు మరియు సాధా రణ క్యాన్సర్‌లు (ఓరల్, బ్రెస్ట్ మరియు సర్వైకల్ క్యాన్సర్‌లు)స్క్రీనింగ్సర్వే నవంబర్ 14 2024 నుండి ప్రారంభం అయ్యింది కమిషనర్ సూచన ల ప్రకారం, ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఉన్న స్పె షలిస్ట్ వైద్యులు (కమ్యూనిటీ మెడిసిన్, అంకాలజీ, రేడియాలజీ, సర్జికల్, గైనకాలజీ మరియు డెంటల్ మరియు డిస్ట్రిక్ట్ ఎన్.సి.డి బృందం) హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్లో శిక్షణ పొం దిన శిక్షణ కార్యక్రమంలో అగనంపూడి, విశాఖ పట్నం మరియు ఫీల్డ్ హెల్త్ వర్కర్లకు పి.హెచ్.సి యు.పి.హెచ్..సి మెడికల్ ఆఫీసర్లు, సి.హెచ్.ఓ. లు మరియు అర్బన్ ఏ.ఎన్.ఎం.లు అందరూ స్క్రీనింగ్ శిక్షణ పొందియున్నారు రూరల్ లో ఆరోగ్య సిబ్బంది సి.హెచ్.ఓలు మరియు ఏ.ఏ న్.ఎం.లు, అర్బన్లో అర్బన్ ఏ.ఎన్.ఎం.లు, బి. ఎస్సి.నర్సింగ్ స్టూడెంట్స్ మరియు ఆశ వర్కర్ లో ఇంటి ఇంటి కి వెళ్ళి 18ం సంవత్సరాల జనాభా అందరకి ఎన్.సి.డిల కోసం పరీక్షలు నిర్వహించెదరు 30ం సంవత్సరాల జనాభా (పురుషులు %ఽ% మహిళలు) నోటి క్యాన్సర్ కోసం పరీక్షించబడును.30ం సంవత్సరాల జనాభా (మహిళలు మాత్రమే) రొమ్ము %ఽ% గర్భాశయ క్యాన్సర్‌ల కోసం పరీక్షించబడతారు. అసాధా రణ కేసులను వైద్య అధికారులు పరీక్షించి మరి యు అనుమానితులను మంగళవారాలు మరి యు గురువారాలు ఫాస్ట్ ట్రాక్ ఛానెల్‌తో ప్రివెం టివ్ ఆంకాలజీ యూనిట్, కే.జీ.హెచ్. కి సూచి స్తారు.ప్రారంభం నుండి ఇప్పటి వరకు మొత్తం 458321 మందికి స్క్రీనింగ్ చేసి యున్నారు సుమారు 155943 గృహములు కు ఆరోగ్య సిబ్బంది ఇంటి ఇంటికి వెళ్ళి స్క్రీనింగ్ చేసి యున్నారు క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యం " అనే నినాదంతో ఎన్.సి.డి 3.0 స్క్రీనింగ్ కార్యక్రమంపై సాధారణ ప్రజలకు పూర్తి మద్దతును అందించాలని మరియు అవగాహన కల్పించాలని అన్ని లైన్ డిపార్ట్ మెంట్లు అభ్యర్థించబడ్డాయి.జిల్లాలో ఉన్న ప్రతి పౌరులు ఈ యొక్క అవకాశంను వినియోగిం చికోవాలి అని అలాగే ప్రతి ఒక్కరూ కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడంతో కాన్సర్ మహమ్మరిని ముందుగా గుర్తించి కాన్సర్ బారిన పడకుండా ఆరోగ్యంను కాపాడుకోవాలసినిది గా కొరియున్నారు .

ఈ ర్యాలీ లో డా.పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, మంగళగిరి, గుంటూరు వారు, డా.పి.జగదీశ్వర రావు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారు, డా,బి.ఉమావతి,డా.హారిక, జిల్లా మహిళా ఆరోగ్య అధికారి, మోహన్ కన్సల్టెంట్, 500 మంది ఆరోగ్య సిబ్బంది మరియు కేన్సర్ ను జయించిన ప్రముఖ సీనియర్ సినీ నటి శ్రీమతి గౌతమి,శిల్పా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన మత్స్యకారుడు అప్పారావు కుటుంబానికి ఆర్థిక భరోసా......

విశ్రాంత విద్యాశాఖ అధికారి అమృత్ కుమార్....



నాతవరం పెన్ పవర్ ( ఫిబ్రవరి 17): మండలంలో గల తాండవ జలాశయంలో చేపల వేటతో కుటుంబాన్ని పోషిస్తున్న గొలుగొండ మండలానికి చెందిన పోగచెట్ల గ్రామానికి చెందిన అప్పారావు ఇటీవల ఆరు నెలల క్రితం తాండవ జలాశయంలోకి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బోటు ప్రమాదంలో మృతి చెందాడు. దీనిపై స్పందించిన నాతవరం మండలం విశ్రాంత విద్యాశాఖ అధికారి టి.అమృత్ కుమార్ ఆయన పెన్షన్ తీసుకుంటూ దానిలో 2000 రూపాయలు ప్రతి నెల పెన్షన్ రూపంలో అందజేస్తానని ఆర్థిక భరోసా కల్పించారు.అప్పారావు భార్య ఆమెకు నలుగురు కుమార్తెలు, తల్లిని పోషించుకొని భర్త మీద ఆధారపడి జీవించేవారు. ఇటీవల మగదిక్కు కోల్పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న విశ్రాంత అధికారి ఆమెకు 2000 రూపాయలు నగదు రూపంలో సోమవారం అందజేశారు.సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు ఈమెకు వితంతు పెన్షన్ వచ్చే విధంగా ప్రభుత్వం నుండి ఆర్థిక భరోసా కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## మేము ఎమ్మెల్యే తాలూకా

- 13వ వార్డులో చక్రం తిప్పుతున్న కొందరు తెలుగు తమ్ముళ్లు
- తమ్ముళ్లు రెండు వర్గాలుగా ఒకరిపై ఒక విమర్శలు ఇది పార్టీకి శ్రేయస్కరం కాదు



స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఫిబ్రవరి 17: తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ జోన్ 2 పరిధి 13 వ వార్డు లొ కొందరు తెలుగు తమ్ముళ్ల తమ హవా కొనసాగిస్తున్నారు.కొందరైతే మేము ఎమ్మెల్యే తాలూకా అంటూ రెండు వర్గాలుగా ఏర్పడి అధికారులను, సచివాలయ సిబ్బందిని,గృహ నిర్మాణం చేపడుతున్న యజమానులను ఇబ్బంది పాలు చేస్తున్నారు.అక్రమ నిర్మాణాదారులకు మేమున్నామంటూ భరోసా ఇస్తూ అక్రమనిర్మాణాలకు తమ సహకారాన్ని అధికారాన్ని ఉపయోగించుకుంటూ తమ జేబులు నింపుకుంటున్నారు. వైసిపి పరిపాలనలో వైసిపి నాయకుల చర్యలను విమర్శించిన తెలుగు తమ్ముళ్లు.రోజురోజుకీ తమ్ముళ్ల తీరు మితిమీరడంతో వీరి తీరు పట్ల ప్రజలు ఉద్యోగులు ఆసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పార్టీ తరఫున ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడం వారి సమస్యలను తీర్చడం ప్రజలకు ప్రభుత్వానికి వారదులుగా నిలిచినట్లయితే బాగుంటుందని అలా కాకుండా వ్యక్తిగత ప్రయోజనాలపై దృష్టి సారించడం పట్ల ఇటు పార్టీకి పార్టీ పెద్దలకు చెడ్డ పేరు తీసుకురావడం సరికాదని ప్రజలు వారి అభిప్రాయాలు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కొందరు తెలుగు తమ్ముళ్ల తీరును సరిదిద్దాలని పార్టీ అభిమానులు ప్రజలు కోరుతున్నారు.

## ర్యాగింగ్ లాంటి సంఘటనలు పునరావృతం జరగకుండా చూసుకోవాల్సిన పూర్తి బాధ్యత స్కూల్ యాజమాన్యందే.

పి.ఓ డా.అభిషేక్ గౌడ.





**పాడేరు,పెన్ పవర్ ఫిబ్రవరి 17.** అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో ఇటీవల సెయింటేన్స్ పాఠశాలలో జరిగిన ర్యాగింగ్ లాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకూడదని జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఎం.జె అభిషేక్ గౌడ్ ఆదేశించారు. 16. తేదీన సోషల్ మీడియాలో 17 వ తేదీన కొన్ని దినపత్రికలలో ప్రచురించబడిన (సెయింటేన్స్ పాఠశాల) కు చెందిన విద్యార్ధిని పై సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ కు సంబంధించిన ఘటన పై సంయుక్త కలెక్టర్ పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి డా.ఎం.జె అభిషేక్ గౌడ స్పందించారు.సోమవారం సెయింటేన్స్ పాఠశాల యాజమాన్యం,డి.ఈ.ఓ., డి.డి.(టి.డబ్ల్యు)ల సమక్షంలో విచారణ జరపారు.సదరు విద్యార్థిని పై జరిగిన ఘటనకు సంబంధించి పాఠశాలలో వసతిగృహ కేర్ టేకర్ గా పనిచేస్తున్న శ్రావ్యను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఘటన సమయంలో ఉన్నప్పటికీ చర్యల నిమిత్తం ఘటన విషయాన్ని పై అధికారులైన ప్రిన్సిపాల్ కు లేదా ఇతర ప్రభుత్వ అధికారులకు తెలియజేయనందున, ఆమెను విధులనుండి తొలగించడమైనది.ఘటనకు పాల్పడిన తోటి విద్యార్ధులను క్రమశిక్షణ లో బాగంగా హాస్టల్ నుండి తొలగించరు ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపేందుకు ఎం.ఇ.ఓ., ఏ.టి.డబ్ల్యు. ఓ.,సి.డి.పి.ఓ. లతో కూడిన ఒక విదారణ కమిటిని నియమించి పూర్తి దర్యాప్తు జరుపాలని డి.ఇ.ఓ., పాడేరు వారికి,జే.సి, పీ.ఓ.ఆదేశించారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏ.ఎస్.ఆర్ జిల్లాలో ప్రతి వసతి గృహం (ప్రభుత్వ. ప్రైవేట్)లో పర్యవేక్షణ పటిష్టంగా జరపాలని హాస్టల్స్ లో పాటించవలసిన నియమ నిబంధనలు రూపొందించాలని, డి.ఇ.ఓ.ను, డి.డి.(టి.డబ్ల్యు.)ను ఆదేశించారు.

## కశింకోట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

- పెండింగ్‌లో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను పరిశీలన
- కేసుల పురోగతిపై అధికారులకు సూచనలు





**అనకాపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** కశింకోట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి పురోగతిపై అధికారులను సూచనలు చేశారు. సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు, తాళ్లపాలెం జంక్షన్ లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇతర రవాణా మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు (డైనమిక్ చెకింగ్) నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు, ప్రధాన కూడళ్ల వద్ద మరియు ఇతర కీలక ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలను ప్రజల సహకారంతో ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. రౌడీ షీటర్లు మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి పగలు గస్తీని మరింత పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో తరచూ సందర్శించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కశింకోట ఇన్‌స్పెక్టర్ ఏ.స్వామి నాయుడు, ఎస్సై మనోజ్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆధ్వర్యంలో..






### మినిస్టీరియల్ సిబ్బందితో సమీక్ష సమావేశం

**అనకాపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపిఎస్ ఆధ్వర్యంలో మినిస్టీరియల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనకాపల్లి, జిల్లా పోలీస్ కార్యాలయంలో మినిస్టీరియల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసు కార్యాలయం సంబంధించిన విభాగాల వారీగా (సెక్షన్ వైస్) సమీక్ష చేపట్టి, ఉద్యోగుల పనితీరు, సేవల నిర్వహణ, అలాగే విభాగాల పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి పలు కీలక అంశాలను చర్చించారు. పోలీసు సిబ్బంది అభివృద్ధి, వృత్తి పరమైన శిక్షణ, సంక్షేమ పథకాలు, అలాగే వారి సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉద్యోగుల్లో స్ఫూర్తిని పెంచేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, పోలీస్ సిబ్బందికి మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు తగిన మార్గదర్శకాలను ఇచ్చారు. నూతన విధానాలు, సాంకేతికత వినియోగం, మరియు కార్యాలయంను మరింత సమర్ధంగా మార్చే విధంగా పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. జిల్లా పోలీస్ సిబ్బందికి మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఏ.వో ఏ.రామ్ కుమార్, సెక్షన్ సూపరింటెండెంట్ లు కె.వి.వరలక్ష్మి, పి.శేషు, ఎన్.వి.గిరిబాబు మరియు మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మ వారి ప్రధమ వార్షికోత్సవంలో..








- పాల్గొన్న 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ

**ఎన్ఏడి, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** జీవీఎంసీ 90వ వార్డ్ లోని కనకమహాలక్ష్మీ నగర్ నందు వెలసిన శ్రీ కనక మహాలక్ష్మీ అమ్మ వారి ప్రధమ వార్షికోత్సవం సందర్భంగా అమ్మ వారిని దర్శించి, ప్రత్యేక పూజలను జీవీఎంసీ కమిటీ మెంబర్, 90వ వార్డ్ కార్పొరేటర్ బొమ్మిడి రమణ నిర్వహించారు. అనంతరం నిరంజన్ వి టాక్ ప్రెస్ సోదరుడు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ పాల్గొన్నారు. మిత్రులు అజయ్ సోదరుడు కుమారుని ఉపనయనం కార్యక్రమం సందర్భంగా కనక మహాలక్ష్మీ నగర్ కాలనీ ప్రతినిధులు ఇడదాసరి గోపాల్ రావు, రాం ప్రసాద్, జీ విపిపి నాయుడు, డి టి నాయుడు, ఎం ఏ స్ నాయుడు, శేషగిరిరావు, సోమేశ్వరరావు, రూప్ సుందర్, కృష్ణ రాజు, నారాయణ రావు, జోగా రావు, మిత్రులు అజయ్, మహిళలు, అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభముగా స్వామి వారి నిత్య కల్యాణం







**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి 17 :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండ పంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## మా పట్టాలు మా గ్రామం పేరునా ఇప్పించండి మహాప్రభో...

గూడెం అగ్రహారం బదులు, దారకొండ అగ్రహారం పేరున పట్టాలు

సాంకేతిక లోపాన్ని తొలగించాలని కలెక్టర్కు విజ్ఞాపన చేసిన గ్రామస్తులు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం జి.అగ్రహారం గ్రామస్తుల పట్టాలు దారకొండ అగ్రహారం గ్రామం పేరున రిజిస్టర్ అయి ఉండటం వలన గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. జి అగ్రహారం గ్రామంలో సుమారు 80 కుటుంబాల ప్రజలకు జి అగ్రహారం గ్రామంలో ఉన్న భూములకు దారకొండ అగ్రహారం గ్రామం పేరున వారి రెవెన్యూ పట్టాలలో నమోదు అయి ఉంది . వారి పట్టాలకు జి అగ్రహారం బదులుగా దారకొండ అగ్రహారం అని నమోదు చేయడంతో ప్రజలు ప్రభుత్వం నుండి వస్తున్న పథకాలు పొందాలంటే తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. జి అగ్రహారం ప్రజలు అన్నదాత సుఖీభవ, రైతు భరోసా, ఇతర సంక్షేమ పథకాలు పొందాలంటే దారకొండ అగ్రహారం వెళ్లి బయోమెట్రిక్ వేయాల్సి వస్తుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు విశిష్ట సంఖ్య నమోదు కొరకు కూడా రైతులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. వారు దారకొండ సచివాలయం వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జి అగ్రహారం ప్రజలు గతంలో జిల్లా కలెక్టర్కు తమ పట్టాలలో గ్రామం పేరు మార్పిడి చేయాలని పాడేరు వెళ్లి వినతి పత్రం అందించారు. అప్పటి కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తామని చెప్పి నేటికి సంవత్సరం పైగా పూర్తయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దారకొండ అగ్రహారం వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కొరకు సమయంతో పాటు, డబ్బులు కూడా వృధాగా ఖర్చు చేయాల్సి వస్తుందని అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు కాకరి కృష్ణారావు, గెమ్మెలి గోవిందరావు, గెమ్మెలి మత్స్య రాజు, గెమ్మెలి నరసింహారావు,కొర్ర సీతారాం కోరారు.



## 22 నుంచి విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఫిబ్రవరి 17:** నగరంలోని హనుమంతవాక దరి, విజయదుర్గా కోలనీ విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 20 నుంచి 22 వరకూ మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఉత్సవాలలో మొదటి రోజు ఉదయం నాదస్వర వాయిద్యాలతో, వేదమంత్రాలతో సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, గణపతి హోమం, మంటపారాధన నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు 108 కలశములతో క్షీరాభిషేకం, అమ్మవారికి రజిత పుష్పార్చన, కుంకుమార్చన, శతనామ పూజలు, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి పురవీధి ఊరేగింపు. అమ్మవారి పల్లకీ ఊరేగింపు (తిరువీధి), శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమావుడూరు సంవత్ కుమార్ శర్మ పర్యవేక్షణలో వేదపండితులచే 'సామూహిక లక్ష కుంకుమార్చనలు', అన్న సమారాధన' రాత్రి తొమ్మిదో వార్డు కార్పొరేటర్ ఉమ్మిడి స్వాతిదాస్ ఆర్థిక సహాయంతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటాయని ఆలయ కమిటీ అధ్యక్షులు %యాచీ% రాజు తెలిపారు. శనివారం అమ్మవారి సుప్రభాతసేవ, అభిషేకములు, లలిత సహస్రనామ పారాయణములు, సహస్ర గులాబీ పుష్పార్చన. అమ్మవారికి అష్టోత్తర పుష్పార్చన. విశేష పూజలు, సాయంత్రం "జాతర, ప్రముఖ సినీ నిర్మాత, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచెర్ల అచ్యుతరావు ఆర్థిక సహాయంతో భారీ స్టేజి షో, అమ్మవారి పురవీధి ఊరేగింపు, తప్పెటగుళ్ళు, కోలాటాలు, బండ్లవేషాలతో పులివేషాలతో ఉత్సవాలు ముగింపు ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు వి నాగభూషణం, డీవీఎల్ఎన్ స్వామి పేర్కొన్నారు.

# లోకేష్ కోసం పవన్ తగ్గుతున్నారా...

**విజయవాడ, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** ఎం గా ఉంటే ఏ రేంజ్ పరిపాలన అందిస్తాడో అని అందరూ మాట్లాడుకున్నారు. కేవలం గ్రామా పంచాయితీలను అభివృద్ధి చేయడమే కాదు, రాష్ట్రము లో ఏ సమస్య ఎదురైనా పవన్ కళ్యాణ్ తన గళాన్ని వినిపిస్తూ అధికార యంత్రాంగాన్ని పరుగులు తీయించాడు. దీంతో తెలుగు దేశం పార్టీ క్యాడర్ లో, లీడర్స్ లో కాస్త అభద్రతా భావం కలిగింది.ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి గా పవన్ కళ్యాణ పాలన ఏ స్థాయిలో ఉందో మనమంతా చూస్తూనే ఉన్నాము. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల సమయంలోనే ఆయన పాలనలో గ్రామా పంచాయితీలు 70 సంవత్సరాలుగా చూడని అద్భుతమైన పురోగతిని చూసింది. పవన్ కళ్యాణ్ లాంటి లీడర్ అధికారం లో ఉంటే ఇలాంటి అద్భుతాలే జరిగతాయని ప్రజలు మాట్లాడుకున్నారు,ఆయన ఇమేజ్ జనాల్లో విపరీతంగా పెరిగిపోయింది. డిప్యూటీ సీఎం గా ఉంటేనే ఇన్ని చేస్తున్నాడంటే, ఇక సీఎం గా ఉంటే ఏ రేంజ్ పరిపాలన అందిస్తాడో అని అందరూ మాట్లాడుకున్నారు. కేవలం గ్రామా పంచాయితీలను అభివృద్ధి చేయడమే కాదు, రాష్ట్రము లో ఏ సమస్య ఎదురైనా పవన్ కళ్యాణ్ తన గళాన్ని వినిపిస్తూ అధికార యంత్రాంగాన్ని పరుగులు తీయించాడు. దీంతో తెలుగు దేశం పార్టీ క్యాడర్ లో, లీడర్స్ లో కాస్త అభద్రతా భావం కలిగింది. క్రేజ్ మొత్తం కూటమి లో పవన్ కళ్యాణ్ కి మాత్రమే దక్కుతుంది, నారా లోకేష్ ని అసలు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు, తండ్రి చాటు బిడ్డగానే ఆయన మిగిలిపోయేలా ఉన్నాడు అంటూ టీడీపీ మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. దీంతో టీడీపీ క్యాడర్, టీడీపీ ఎమ్మెల్యే లు నారా లోకేష్ ని డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్ బాగా పెరిగింది. సోషల్ మీడియా లో అటు టీడీపీ అభిమానుల మధ్య, ఇటు జనసేన అభిమానుల మధ్య ఈ అంశంపై పెద్ద ఎత్తున గొడవలు కూడా జరిగాయి. నారా లోకేష్ ని డిప్యూటీ సీఎం చేయడంలో మాకు ఎలాంటి అభ్యంతరం లేదు, కానీ పవన్ కళ్యాణ్ ని మాత్రం సీఎం చేయాలి అనే డిమాండ్ ని తెర మీదకు తీసుకొచ్చారు. ఈ అంశం ఇరు పార్టీల అదిష్టానాల వరకు వెళ్లడంతో వెంటనే స్పందించి ఫుల్ స్టాప్ పెట్టారు. పవన్ కళ్యాణ్ అయితే రిపబ్లిక్ డే రోజున అభిమానులు ఓర్పు వహించాలి అంటూ పెద్ద లేఖనే రాసుకొచ్చాడు.ఆరోజు నుండి వరుసగా 15 రోజుల పాటు పవన్ కళ్యాణ్ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. మళ్ళీ చాలా కాలం తర్వాత ఇప్పుడు మళ్ళీ ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీ అయ్యాడు. ఈ 15 రోజులు ఎందుకు ఆయన అంత మౌనం వహించాడు?, నిజంగా ఆరోగ్యం బాగాలేక కనిపించలేదా, లేదా లోకేష్ ని హైలైట్ చేయడానికి, ఈయన లొ ప్రొఫైల్ ఇక నుండి మైంటైన్ చేయాలనీ ఫిక్స్ అయ్యాడా? అనే సందేహాలు అభిమానుల్లో



తలెత్తుతున్నాయి. నిన్న జరిగిన మ్యూజికల్ నైట్ లో పవన్ కళ్యాణ్ నారాలోకేష్ గురించి మాట్లాడుతూ 'ఆంధ్ర ప్రదేశ్ భవిష్యత్తుని తీర్చి దిద్దడంలో కీలకమైన అడుగులు వేస్తున్న లోకేష్ గారికి' అంటూ సంబోదించాడు. ఇది పవన్ కళ్యాణ్ యాదృచ్ఛికంగా అన్న మాటలా?, లేకపోతే భవిష్యత్తులో మనం లోకేష్ ని మోయాలి అంటూ తన అభిమానులను ప్రిపేర్ చేయడానికి ఇప్పటి నుండే రెడీ చేస్తున్నాడా అనే సందేహిస్తున్నారు.

### ఓజీ క్రేజీ మాములుగా లేదుగా

పవన్ కళ్యాణ్ నటిస్తున్న చిత్రాలలో ఓజీ క్రేజ్ రోజురోజుకి బౌండరీలు దాటుతుంది. ఆ సినిమా పేరు వినిపిస్తే చాలు, ఏ సభా ప్రాంగణం అయినా ప్రకంపనలతో హోరెత్తిపోతుంది. ఇంత క్రేజ్ ఒక సినిమాకి చూసి మన తెలుగు ఆడియన్స్ చాలా కాలమే అయ్యింది. 'పుష్ప 2?కి కూడా విడుదలకు ముందు ఈ స్థాయి క్రేజ్ ని చూడలేదు. సుజిత్ కి కేవలం రెండు సినిమాల అనుభవం మాత్రమే ఉంది. ఏ స్టార్ హీరో అయినా పెద్ద డైరెక్టర్ తో చేస్తే క్రేజ్ వస్తుంది, అది సహజం. కానీ పవన్ కళ్యాణ్, సుజిత్ తో సినిమాని ప్రకటించినా ఇంత క్రేజ్ రావడానికి ప్రధాన కారణం, నేటి తరం ఆడియన్స్ అభిరుచికి తగ్గట్టుగా పవన్ కళ్యాణ్ సినిమా తీస్తుండడం వల్లే. ఈమధ్య కాలంలో పవన్ కళ్యాణ్ ఏ ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్లినా అభిమానులు ఓజీ, ఓజీ అని నినాదాలు చేయడం ఆయన్ని ఎంతగా ఇబ్బంది పెట్టాయో మన అందరికీ తెలిసిందే. విజయవాడ లో సీఎం చంద్రబాబు నాయుడుసతీమణి నారా భువనేశ్వరి గారి ఆద్వర్యం లో తలసేమియా వ్యాధి బాధితులకు సహాయం చేయడం కోసం, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఒక మ్యూజిక్ నైట్ ని నిర్వహించారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఒక్క పైసా రెమ్యూనరేషన్ కూడా ఆశించకుండా, ఈ మ్యూజిక్ నైట్ ని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ యూఫోరియా మ్యూజికల్ నైట్ పేరుతో నిర్వహించాడు. ఈ ఈవెంట్ కి సీఎం చంద్రబాబు నాయుడు మరియు ఆయన కుటుంబ సభ్యులతో పాటు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ముఖ్య అతిథిగా పాల్గొన్నాడు. అయితే ఈ ;ప్రోగ్రాం మొత్తంలో పవన్ కళ్యాణ్ క్రేజ్ ఒక రేంజ్ లో డామినేట్ చేసింది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తమన్ మ్యూజిక్ ఈవెంట్ ని ప్రారంభించేముందు స్టేడియం మొత్తం 'ఓజీ..ఓజీ' నినాదాలతో హోరెత్తిపోయింది.ఆ ప్రకంపనలు చూసి పవన్ కళ్యాణ్ మౌనం గా అలా చూస్తూ ఉండిపోగా, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మాత్రం షాక్ కి గురయ్యారు. ఆ రేంజ్ లో దద్దరిల్లిపోయేలా చేసారు. తమన్ కూడా ఆ క్రేజ్ ని చూసి నవ్వుకొని, ఓజీ గురించి పాట రూపం లో మాట్లాడుకుందామని ఆయన ఓజీ గ్లిమ్స్ ఆడియో ట్రాక్ ని పాడుతాడు. దీనికి సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చింది. దానికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియా అంతటా తెగ వైరల్ గా మారింది. ఇతర హీరోల అభిమానులు సైతం ఆ వీడియో ని చూసి ఇదేమి క్రేజ్ రా బాబు అని పవన్ కళ్యాణ్ ని ట్యాగ్ చేసి దండం పెడుతున్నారు. మరోవైపు కొంతమంది అభిమానులు తొందరగా ఈ సినిమాని పూర్తి చేసి విడుదల చెయ్యి అన్న, హైప్ మీటర్ ఇప్పటికే బ్లాస్ట్ అయిపోయింది అంటూ చెప్పుకొస్తున్నారు.

# మార్చిలో జనసేన వర్సెస్ వైసీపీ

**విజయవాడ, ఫిబ్రవరి 17, పెన్ పవర్:**
మార్చి సమీపిస్తోంది.. మరో 10 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. మార్చి 12న వైసీపీ ఆవిర్భావ దినోత్సవం జరగనుంది. అదే సమయంలో జనసేన ప్లీనరీ సైతం జరగనుంది. దీంతో అంతటా పొలిటికల్ హీట్ ఉంటుంది ఈ నెలలో. ఇప్పుడిప్పుడే వేసవి ప్రారంభమైంది. రాజకీయ వేడి కూడా ఉంది. ఇటువంటి తరుణంలో రెండు పార్టీలకు సంబంధించి కీలక కార్యక్రమాలు మార్చిలోనే ఉండడం విశేషం. దీంతో పోటా పూర్తిగా ప్రకటనలు ఉండనున్నాయి. అదే సమయంలో రాజకీయ విమర్శలు, వ్యూహాలు సైతం కొనసాగనున్నాయి. దీంతో మార్చిలో పొలిటికల్ హైట్ అండ్ సన్ వాతావరణం క్రియేట్ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అధికార, విపక్షాలకు సంబంధించి ఒకే రోజు కార్యక్రమాల నిర్వహణ ఉండడంతో తప్పకుండా రాజకీయ అంశాలు, సంచలనాలు ఉండనున్నాయి.జనసేన ప్లీనరీని మార్చి 12 నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. పిఠాపురంలో ప్లీనరీ నిర్వహిస్తుండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. లక్షలాదిమంది తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జనసేనకు ఈ ఎన్నికల్లో మంచి విజయం దక్కింది. కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది జనసేన. అందుకే ఈ ప్లీనరీ జనసేనకు ప్రత్యేకం. ఇదే వేదికగా జనసేన సంచలన నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అటు రాజకీయంగా కొన్ని రకాల నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.అయితే ఇదివరకు ఎన్నడూ లేని గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది వైయస్సార్ కాంగ్రెస్పార్టీ. 2012 మార్చి 12న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించింది. పుష్కర కాలం దాటి 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటుంది ఆ పార్టీ. అయితే తొలి ఆరేళ్లు బలమైన ప్రతిపక్షంగా ఉంది వైయస్సార్





కాంగ్రెస్. గత ఐదు సంవత్సరాలుగా అధికారపక్షంగా ఉండేది. అయితే ఈ ఎన్నికల్లో ఘోర పరాజయంతో ఆ పార్టీ పరిస్థితి మారింది. ఇప్పటివరకు ఒక లెక్క.. మొన్నటి ఎన్నికల తర్వాత మరో లెక్క అన్నట్టు ఉంది ఆ పార్టీ పరిస్థితి. చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం ఇది. అందుకే అధినేత జగన్మోహన్ రెడ్డి దూకుడుగా అడుగులు వేస్తున్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవం నాడు ఆయన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.ఉగాది నుంచి ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అదే సమయంలో పార్టీకి చెందిన కీలక నేతలు రాజీనామాలు ప్రకటిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లతో పాటు తటస్థ నేతలు వైసిపి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు కీలక నిర్ణయాలు వెల్లడిస్తారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇంకోవైపు కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన సైతం.. ప్లీనరీ వేదికగా సంచలన ప్రకటనలు చేసే పరిస్థితి ఉంది. దీంతో సర్వత్రా దీనిపై ఉత్కంఠ కొనసాగుతోంది. మార్చిలో పొలిటికల్ హీట్ కొనసాగే పరిస్థితి ఉంది. చూడాలి మరి ఎలాంటి పరిణామాలు జరగబోతాయో!

# షర్మిళ వర్సెస్ సునీత...

**కడప, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** వైయస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఆరేళ్లు అవుతోంది. కానీ ఇంతవరకు కేసు కొలిక్కి రాలేదు. దీంతో ఆయన కుమార్తె సునీత తీవ్ర అసహనంతో ఉన్నారు.వైఎస్ షర్మిల, సునీతల మధ్య విభేదాలు తలెత్తయా? ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోందా? షర్మిల వైఖరిపై సునీత ఆగ్రహంగా ఉన్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ముఖ్యంగా వివేకానంద రెడ్డి హత్య అంశం మరుగున పడిపోయింది. ఇది సునీతకు మింగుడు పడడం లేదు. అదే సమయంలో వైయస్ షర్మిల సైతం సైలెంట్ అయ్యారు. దీనిపైన ఎక్కువగా ప్రశ్నిస్తున్నారు సునీత. దీంతో అక్కా చెల్లెలు మధ్య మాటల యుద్ధం ప్రారంభమైనట్లు తెలుస్తోంది. రాజకీయ ఎదుగుదలకు వివేకానంద రెడ్డి హత్యను వాడుకున్నారని.. ఇప్పుడు న్యాయం చేయలేకపోతున్నారని సునీత మండిపడుతున్నట్లు సమాచారం. కడప పొలిటికల్ సర్కిల్ ఇదే చర్చ నడుస్తోంది.2019 మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు వైయస్ వివేకానంద రెడ్డి అప్పట్లో ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రచార అస్త్రంగా మారింది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే నిందితులకు కఠిన శిక్ష పడుతుందని వివేక కుమార్తె సునీత ఆశించారు. అయితే జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి సీన్ మారింది. అప్పటివరకు సిబిఐ దర్యాప్తు కోరిన జగన్ అవసరం లేదని తేల్చి చెప్పారు. అసలు నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయనపై ఆరోపణలు వినిపించాయి. అప్పటినుంచి వివేక కుమార్తె సునీత న్యాయపోరాటానికి దిగారు. అప్పటి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూడా ఆమె పావులు కలిపారు. సుప్రీం కోర్టు వరకు వెళ్లారు. అయితే సోదరుడు జగన్మోహన్ రెడ్డితో రాజకీయంగా విభేదించారు షర్మిల. అటు బాబాయి వివేకానంద రెడ్డి హత్య అంశంలో సోదరి సునీతకు మద్దతు తెలిపారు.2024 ఎన్నికలకు ముందు వివేకానంద రెడ్డి హత్య అంశాన్ని ప్రచార అస్త్రంగా మార్చుకున్నారు వైయస్ షర్మిల, సునీతలు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంత డ్యామేజ్ చేయాలో అంతలా చేశారు. వ్యతిరేక ప్రచారంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయానికి ఒక కారణం అయ్యారు. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతోంది. వివేకానంద రెడ్డి హత్య కేసు ఒక్క అంచు కూడా ముందుకు కదలడం లేదు. వైయస్ సునీత సీఎం చంద్రబాబు తో పాటు హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను కూడా కలిశారు. హత్య కేసు విచారణ వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే నెలలు గడుస్తున్నా కేసు విచారణలో మాత్రం ఎటువంటి పురోగతి లేదు. దీంతో వైఎస్ సునీతలో అసహనం పెరుగుతోంది. ఆమె న్యాయపోరాటం సాగిస్తున్నారు. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కేసు విషయంలో ఆశించిన స్థాయిలో పావులు కదపడం లేదు.మరోవైపు వైయస్ షర్మిల సైతం వివేకానంద రెడ్డి హత్య అంశాన్ని విడిచిపెట్టారు. గత ఎనిమిది నెలలుగా ఆమె నోటి నుంచి వివేకానంద రెడ్డి హత్య మాటలు రావడం లేదు. దీంతో వైయస్ సునీత షర్మిలపై తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే విషయంపై గత రెండు రోజులుగా వాట్సాప్ మెసేజ్ ల రూపంలో ఇద్దరి మధ్య యుద్ధం నడుస్తున్నట్లు అంతర్గతంగా ప్రచారం జరుగుతోంది. వివేకానంద రెడ్డి హత్య విషయంలో ఎందుకు సైలెంట్ అయ్యావు అంటూ సునీత షర్మిలను ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోందని.. మున్ముందు ఇది ఎంతవరకు దారితీస్తుందోనని అనుమానాలు ఉన్నాయి. అయితే మున్ముందు పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి.

# షర్మిల దెబ్బకు కాంగ్రెస్ క్లీన్ బౌల్డ్

**విజయవాడ, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** సహజంగా అధికారపార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉంటుంది. ప్రతిపక్షపార్టీలను ఎవరూ పట్టించుకోరు. అధికారంలో లేని వారిని విమర్శించి కూడా ప్రయోజనం లేదు. ఎందుకంటే వారు పవర్ లో లేరు కాబట్టి విమర్శలు చేసినా వారు చేసేది శూన్యమే. కానీ విచిత్రంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వం పట్ల సాఫ్ట్ కార్నర్ గా ఉండటం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. ఇలా అయితే



ఉన్ననాలుగు ఓట్లు కూడా వచ్చే అవకాశం లేదని సొంత పార్టీ నేతలే అంటున్నారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత రఘువీరారెడ్డి, సాకే శైలజానాథ్, గిడుగు రుద్రరాజు వంటి వారు నాటి అధికార పార్టీనే లక్ష్యంగా చేసుకుని పోరాడిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలే గుర్తు చేస్తున్నారు.. కానీ వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ అయిన నాటి నుంచి తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను మాత్రమే లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడాన్ని తప్పుపడుతున్నారు. జగన్ పై ఎన్ని విమర్శలు చేసినా ఇప్పుడు ప్రయోజనం లేదు. ఎందుకంటే జగన్ అధికారంలో లేరు. ఆయనను విమర్శించినా జనం పెద్దగా పట్టించుకోరు. ఆయన చేతుల్లో ఏమీ లేదు. మొన్నటి ఎన్నికల్లో దారుణంగా ఓటమి పాలయి తన ఇంటికే పరిమితయ్యారు. అలాంటి జగన్ పై రోజూ విమర్శలు చేయడం వల్ల ఏం ప్రయోజనం చెల్లీ అంటూ నేతలు ప్రశ్నిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. ఎన్నికల సమయంలో విమర్శలు చేసినా అర్థముంది. కానీ ఇప్పుడు జగన్ పై చేసే విమర్శలకు, ఆరోపణలకు విలువలేదన్న విషయం షర్మిలమ్మకు తెలియదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ అవకాశమొచ్చినప్పుడల్లా జగన్ ను వైఎస్ షర్మిల విమర్శించడాన్ని ప్రజలు కూడా పార్టీ పరంగా చూడటం లేదు. ఇది వ్యక్తిగత ద్వేషంతోనే విమర్శలు చేస్తున్నారన్నది బలంగా ముద్రపడిపోయింది. జగన్ గత ఎన్నికలలో ఓటమి పాలయింది తన వల్లనే అనుకునే భ్రమలో షర్మిల ఉందని, దాని నుంచి బయటకు వస్తేనే కొంత పార్టీతో పాటు ఆమెకు కూడా ప్రయోజనం అని నెట్టింట ప్రశ్నిస్తున్నారు. చచ్చిన పామును ఇంకా ఎంతకొట్టినా ప్రయోజనం ఏముంటుందని వారు అంటున్నారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ కు ఏపీలో ఒక్క శాతం ఓటు కూడా పెరగలేదు. ఎందరు పీసీసీ చీఫ్ లుగా మారినా కాంగ్రెస్ ను జనం ఆదరించలేదు. ఒక్క సీటును కూడా కాంగ్రెస్ పార్టీ గత మూడు ఎన్నికల్లో గెలుచుకోలేకపోయింది. పైగా వైఎస్ షర్మిల మిగిలిన పీసీసీ చీఫ్ లకు భిన్నంగా అధికార పార్టీ పట్ల మెతక వైఖరి తగదని సూచిస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించకపోగా, ప్రతపక్ష పార్టీపై చిందులు తొక్కినందున కాంగ్రెస్ తో పాటు కూటమి పార్టీలకు కూడా నష్టమేనని, అది జగన్ కు లాభిస్తుందన్న విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి. కానీ షర్మిల మాత్రం తన తీరును మార్చుకోవడం లేదు. మీడియా సమావేశం పెట్టినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా అది జగన్ కు వ్యతిరేకంగానే ఉండటంతో పరోక్షంగా వైసీపీకి షర్మిల మేలు చేస్తున్నారన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం మెతక వైఖరిని ప్రదర్శించినంత మాత్రాన ఓట్లు పెరుగుతాయా? చెప్పు చెల్లీ అని కాంగ్రెస్ నేతలే ప్రశ్నిస్తున్నారు. మరి షర్మిలమ్మ దీనికి సమాధానం ఏంచెబుతారో చూడాలి.

# ఆచితూచి వ్యవహరిస్తున్న కాపులు

**కాకినాడ, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పుడిప్పుడే పదవిలో కుదురుకుంటున్నారు. ఆయన డిప్యూటీ ముఖ్యమంత్రి బాధ్యతలను చేపట్టి ఎనిమిది నెలలు మాత్రమే అవుతుంది. గత కొన్ని నెలల నుంచి ఆయన తనకు అప్పగించిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల పై ఎక్కువ ఫోకస్ పెట్టారు. ఈ శాఖను ప్రక్షాళన చేయడం మొదలు పెట్టారు. ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి వరకూ భారీ మార్పులు చేసి, బదిలీలు చేసి కొంత మంచి అధికారులను నియమించారు. ఈ శాఖ ద్వారా ప్రజలకు మరింత, మెరుగైన సేవలు చేయాలన్న లక్ష్యంతో పవన్ కళ్యాణ్ ఏరి కోరి గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖను అడిగి తీసుకున్నారు. ప్రజలకు ఏదో చేయాలన్న తపన ఆయన ప్రతి అడుగులో కనిపిస్తుంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖకు న్యాయం చేయాలన్న తపనతో ముందుకు వెళుతున్నారు. ఆయన మరేదీపెద్దగా పట్టించుకోవడం లేదు. కేవలం లడ్డూ వివాదంపై తలదూర్చడం మినహా మిగిలిన రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. అలాగే నిధుల కోసం ఢిల్లీకి పరుగులు తీయడం, కేంద్ర మంత్రులను కలవడం వంటి వాటికి దూరంగా ఉన్నారు. హంగూ ఆర్భాటాలను ప్రదర్శించడం లేదు. కేవలం తన కార్యాలయం, పార్టీ ఆఫీసు అంత వరకే పవన్ కళ్యాణ్ పరిమితమయ్యారు. ఆ ఒక్కటీ తప్ప మరే ఆలోచనను ఆయన చేయడం లేదు. ఆయన లక్ష్యం ఒక్కటే. తాను తీసుకున్న శాఖకు హండ్రెడ్ పర్సెంట్ న్యాయం చేయాలన్నదే. కానీ ఇది కొంత క్యాడర్‌కు, ఆయన పార్టీ జనసేన, కూటమి పార్టీ గెలుపునకు అద్భుతమైన విజయాన్ని అందించడంలో కీలకమైన కాపు సామాజికవర్గంలో మాత్రం కొంత అసంతృప్తి కనిపిస్తుంది. అసహనమూ బయలుదేరిందంటున్నారు.ఆయన వద్దకు వెళ్లిన కొందరు మాత్రమే వ్యక్తిగతంగా ప్రయోజనం, లబ్ది పొందుతున్నా రు కానీ, కాపు సామాజికవర్గం గురించి పవన్ కళ్యాణ్ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో విజయం అందించిన కాపు సామాజికవర్గానికి ఏదో ఒక ప్రయోజనం చేకూరుస్తారని పవన్ కళ్యాణ్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు కాపులు. ముఖ్యమంత్రి కాకపోయినా ఉప ముఖ్యమంత్రి అయినా పెద్దగా రెస్పాన్స్ లేదు. ఎనిమిది నెలలు దాటుతున్నా... అయితే కాపు సామాజికవర్గం నుంచి కూడా ఈ విషయంలో పెద్దగా ఎవరూ బయటపడలేదు. అందరూ మౌనంగానే ఉన్నారు. ఎనిమిది నెలలయినా తమ గురించి, తమ కమ్యునిటీ గురించి పట్టించుకోవడం లేదన్న కొంత అసంతృప్తి అయితే ఉభయగోదావరి జిల్లాల్లో కనిపిస్తుంది. గత ఎన్నికల్లో తూర్పు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాల్లో కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేశాయి. ఆ జిల్లాలపై కూడా ప్రత్యేకంగా పవన్ కళ్యాణ్ ఫోకస్ పెట్టింది లేదు. పర్యటించింది కూడా తక్కువే. మంత్రి వర్గ సమావేశాల్లోనూ తమ కమ్యునిటీ ప్రయోజనాల గురించి ప్రస్తావించిన సందర్భం లేకపోవడం వారిని ఒకరకంగా ఇబ్బంది పెడుతుంది. ప్రస్తుతానికి వారు సైలెంట్ గా ఉన్నప్పటికీ, కొద్దికాలమైన తర్వాత అయినా తమను గురించి పట్టించుకుంటారన్న ఆశతో ఉన్నారు. మరి పవన్ ఏం చేస్తారో అన్నది వేచిచూడాల్సిందే.

# చింతమనేని చిరాకులేల...

**ఏలూరు, ఫిబ్రవరి 17, పెన్ పవర్:** దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఫైర్ బ్రాండ్ లీడర్. ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో ఉంటారు. ఆయన వివాదంలో లేకపోతేనే ఆశ్చర్యపోవాలి. అధికారంలో ఉన్నా లేకపోయినా చింతమనేని రూటే వేరు. తనపై అటెన్షన్ ఉండాలని చింతమనేని ఆకాంక్షిస్తారని భావించాలి. అందుకే తరచూ వివాదాలే రాజకీయంగా ఆయన ఎదుగుదలకు అడ్డంకిగా మారాయన్న కామెంట్స్ సొంత పార్టీ నుంచి వినపడుతున్నాయి. చింతమనేని ప్రభాకర్ సీనియర్ రాజకీయ నాయకుడు. 2019 ఎన్నికల్లో చింతమనే ప్రభాకర్ దెందులూరు నుంచి ఓటమి పాలయ్యారు. ఆయనపై వైసీపీ ప్రభుత్వం అనేక కేసులు నమోదు చేసింది. జైలుకు కూడా వెళ్లి వచ్చారు నేతలకు దిశానిర్దేశం నాడు పార్టీని ఇబ్బందుల్లో... 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత అప్పటి ఎమ్మార్వో వనజాక్షిని బెదిరించిన వైనం చింతమనేని ప్రభాకర్ ను రాజకీయంగా ఇబ్బందులపాలు చేసింది. అంతేకాదు పార్టీ ప్రతిష్టను కూడా దిగజార్చింది. అయినా తగ్గేదేలే అన్నట్లు ఆయన తీరు ఉంటుంది. చింతమనేని ప్రభాకర్ నిత్యం ప్రజల్లో ఉంటారు. అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ కొంత మంచిపేరు తెచ్చుకుంటారు. కానీ ఆ మంచి పేరు వివాదాలతోనే తనకు తానే చెరిపేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీని మాత్రమే నమ్ముకున్న చింతమనేని 2019 ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై కూడా హాట్ కామెంట్స్ చేసి ఒకవర్గానికి దూరమయ్యారన్న వ్యాఖ్యలు పార్టీలో ఇప్పటికీ వినిపిస్తున్నాయ. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సీనియర్ నేతగా ఉన్న పుటికీ ఆయనకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్దగా పదవులు దక్కలేదు. 2009, 2014లో వరసగా దెందులూరు నియోజకవర్గం నుంచి గెలిచిన చింతమనేని ప్రభాకర్ 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అయినా పార్టీ కోసం జెండా వదలలేదు. కార్యకర్తలకు అండగా నిలబడటంలో ముందున్నారు. అనేక కేసులు తనపై నమోదవుతున్నా చింతమనేని ప్రభాకర్ బెదరలేదు. భయపడలేదు. అలాగే అధికార పార్టీకి తలవంచే నైజం కాదు. అదే చింతమనేని ప్రభాకర్ లో ప్లస్ పాయింట్ అని తెలుగు తమ్ముళ్లు అంటారు? తాజాగా మరో వివాదం... తాజాగా మరో వివాదం ఆయన తన నెత్తిమీదకు తెచ్చుకున్నారు. ఒక వివాహ కార్యక్రమానికి హాజరైన చింతమనేని ప్రభాకర్ తనకారుకు అడ్డంగా నిలిపారని స్వయంగా తానే దిగి డ్రైవర్ ను దుర్భాషలాడిన వీడియో సామాజికమాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఆ వాహనం మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిది కావడంతోనే అసలు సమస్య. దీంతో పార్టీ అధినేత చంద్రబాబును కలసి జరిగిన ఘటనపై ఆయన వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లభనేని వంశీ తర్వాత కొడాలి నాని కూడా జైలుకు వెళతారని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత మరికొందరు నేతలు జైలుకు వెళతారన్న చింతమనేని అబ్బయ్య చౌదరి సాఫ్ట్ వేర్ కాదని, హార్డ్ వేర్ అని అన్నారు. మొత్తం మీద మరోసారి చింతమనేని వివాదానికి కేరాఫ్ అడ్రస్ గా మారడంతో పార్టీ నేతలు కూడా కొంత ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా చింతమనేనికి క్లాస్ పీకినట్లు తెలిసింది.

# వక్రబుద్ధి చాటుకున్న పాక్.. కరాచీ స్టేడియంలో ఎగరని భారత జెండా





**హైదరాబాద్ పెన్ పవర్:** ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు విమర్శలకు గురవుతుంది. ఈ మెగా టోర్నీ ప్రారంభానికి ముందు కరాచీలోని నేషనల్ స్టేడియంలో భారత జెండా కనిపించలేదు. ఏడు దేశాల జాతీయ జెండాలు కనిపించినా భారత జెండా మాత్రం ఎగర వేయడానికి పాక్ క్రికెట్ బోర్డు నిరాకరించినట్టు స్పష్టంగా అర్థమవుతుంది. భారత త్రివర్ణ పతాకం కనిపించకపోవడం టీమిండియా అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోసిల్ మీడియాలో తీవ్ర చర్చకు గురి చేస్తుంది. పాక్ బోర్డుపై నెటిజన్స్ తీవ్ర స్థాయిలో మండిపడు తున్నారు. భారత జెండా లేకపోవడం వెనుక ఖచ్చితమైన కారణం ఇంకా తెలియకపోయినా.. టీమిండియా పాకిస్తాన్‌లో తన మ్యాచ్‌లు ఆడకపోవడమే దీనికి కారణమని తెలుస్తుంది. రాజకీయ ఉద్రిక్తతలు, భద్రతా సమస్యల కారణంగా బీసీసీఐ హైబ్రిడ్ మోడల్‌లో మ్యాచ్ లు ఆడనుంది. ఈ మోడల్ ప్రకారం భారత్ తమ అన్ని మ్యాచ్ లు దుబాయ్ వేదికగా ఆడుతుంది. కరాచీలోని నేషనల్ స్టేడియంలో న్యూజిలాండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఇంగ్లాండ్ జట్లు మ్యాచ్ లు ఆడనున్నాయి. కొన్ని రోజుల క్రితం లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుక కార్యక్రమంలోనూ భారత జెండాను కాకుండా మిగిలిన ఏడు దేశాల జెండాలను ఎగరవేశారు. అప్పట్లో ఈ వీడియో వైరల్ అయింది. 2017 తర్వాత దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత మరోసారి ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. వన్డే ఫార్మాట్ లో టాప్ 8 జట్లు ఆడే ఈ టోర్నీ ఫిబ్రవరి 19 నుండి మార్చి 9 వరకు జరుగుతుంది. ఫిబ్రవరి 19 న తొలి మ్యాచ్ లో ఆతిధ్య పాకిస్థాన్ తో న్యూజిలాండ్ తలపడుతుంది. కరాచీ నేషనల్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. పాకిస్థాన్ లోని లాహోర్, కరాచీ, రావల్పిండి ఎనిమిది జట్లు ఆడే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. పాకిస్తాన్,దుబాయ్ వేదికలుగా ఈ మెగా టోర్నీ జరగనుంది. పాకిస్థాన్ లోని లాహోర్, కరాచీ, రావల్పిండి ఎనిమిది జట్లు ఆడే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. భారత జట్టు పాల్గొనే మ్యాచ్‌లు దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ గ్రూప్ ఏ లో ఉండగా.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ గ్రూప్ బి లో ఉన్నాయి.

# మా అమ్మ కష్టం మరువలేనిది.. కష్టాలను చెప్పుకుంటూ రహానే ఎమోషనల్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే భారత జట్టులోకి రావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఇటీవలే రంజీ ట్రోఫీలో అదరగొడుతున్న రహానే మళ్ళీ టీమిండియాలోకి ఎంట్రీ ఇస్తానని ధీమా వ్యక్తం చేశాడు. దశాబ్ద కాలం పాటు రహానే భారత టెస్ట్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఎలాంటి విమర్శలు లేకుండా క్రికెట్ కెరీర్ లో ముందుకు వెళ్తున్న అతి తక్కువ మంది ఆటగాళ్లలో రహానే ఒకడు. ప్రస్తుతం రంజీ ట్రోఫీ సెమీ ఫైనల్ ఆడుతూ బిజీగా ఉన్న రహానే.. ఈ మ్యాచ్ కు ముందు తాను చిన్న వయసులో పడిన కష్టాలను గుర్తు చేసుకున్నాడు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో రహానే తన బాల్య దశలో ఎదుర్కొన్న ఇబ్బందులను చెప్పుకుంటూ ఎమోషనల్ అయ్యాడు. తన తల్లి కుటుంబ ఖర్చులను భరించడానికి చాలా కష్టపడిందని తెలిపాడు. “నేను డోంబివ్లి నుండి వచ్చేవాడిని. రైలు ప్రయాణం నాకు ఛాలెంజిగ్ గా ఉండేది. మా నాన్న ఆఫీసుకు వెళ్లడంతో నేను ఎనిమిదేళ్ల వయస్సు నుండి ఒంటరిగా ప్రయాణించేవాడిని. మా నాన్న సంపాదన సరిపోకపోవడంతో మా అమ్మ డబ్బు సంపాదించడానికి పిల్లలను చూసుకునేది. ఆ జ్ఞాపకాలు నా మనసులో ఉన్నాయి. ఈ కీర్తి, డబ్బు ఈ ఆట వల్లనే వచ్చాయి” అని రహానే చెప్పుకొచ్చాడు.

అగ్ర శ్రేణి క్రికెటర్ గా పేరు సంపాదించుకున్నప్పటికీ లగ్జరీగా జీవించాలనే భావన నాలో లేదు. నేను నా జీవితంలో చాలా ఆలస్యంగా కారు కొన్నాను. నీలేష్ కులకర్ణి, అవిష్కర్ సాల్వి, ప్రవీణ్ తంబేలను లిఫ్ట్ అడిగి వెళ్ళేవాడిని. దేశం తరపున ఆడుతున్నప్పుడు సెకండ్ హ్యాండ్ వ్యాగన్‌ఆర్ కొన్నాను. జనాలు పెద్ద కారు కొను అని అనేవారు. కానీ నాకు మాత్రం సౌకర్యంగా అనిపించేది కాదు. రెండు సంవత్సరాల తర్వాత నేను హోండా కొన్నాను”. అని ఈ రహానే తెలిపాడు. రహానే 2022 లో దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత పేలవ ఫామ్ తో టెస్టు జట్టులో స్థానం కోల్పోయాడు. అయితే ఐపీఎల్ లో అద్భుతమైన ప్రదర్శనతో డబ్ల్యూటీసీ ఫైనల్లో చోటు సంపాదించిన రహానే రెండు ఇన్నింగ్స్ ల్లో వరుసగా 89,46 పరుగులు చేశాడు. కెరీర్ గాడిలో పడిందనుకున్న సమయంలో జులైలో విండీస్ టూర్ లో జరిగిన టెస్ట్ సిరీస్ లో దారుణంగా విఫలమవడం రహానేకు ప్రతికూలంగా మారింది. జాతీయ జట్టుకు దూరమైన రహానే.. దేశవాళీ క్రికెట్‌లో రెగ్యులర్‌గా ఆడుతున్నాడు. ఈ రైట్ హ్యాండ్ బ్యాటర్ ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో 45.76 సగటుతో 13,000కిపైగా పరుగులు చేశాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో 39.72 సగటుతో 6475 పరుగులు చేశాడు.

# డబ్బుల్లేక మూడేళ్లు నూడుల్స్ తిని కడుపు నింపుకున్నారు: పాండ్యా సోదరులపై నీతా అంబానీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబై ఇండియన్స్ జట్టులోకి ఎవరైనా భారత డొమెస్టిక్ ప్లేయర్ చేరితే వారు త్వరలోనే టీమిండియాకు ఎంపికవ్వడం గ్యారంటీ. ఆ జట్టులో ఏం మ్యాజిక్ ఉంటుందో తెలియదు గాని స్టార్ ప్లేయర్లు అయిపోతారు. హార్దిక్ పాండ్య, కృనాల్ పాండ్య, జస్ప్రీత్ బుమ్రా, తిలక్ వర్మ, ఇషాన్ కిషాన్ ఇలా దాదాపు అరడజను ప్లేయర్లు భారత క్రికెట్ లో స్టార్ ప్లేయర్లుగా కొనసాగుతున్నారు. అయితే వీరందరిని తాము వెతికి పట్టుకున్నామని.. వారి కష్టాన్ని, కసిని గుర్తించే ముంబై జట్టులో చేర్చుకున్నామని ఆ జట్టు ఫ్రాంచైజీ నీతా అంబాని వెల్లడించారు. ముంబై ఇండియన్స్ జట్టు యజమాని నీతా అంబానీ, పాండ్య బ్రదర్స్, జస్ప్రీత్ బుమ్రాలను తమ జట్టులోకి తీసుకోవడానికి గల కారణాలను వెల్లడించారు. కృనాల్ జట్టు నుంచి వైదొలిగినప్పటికీ బుమ్రా తన ఐపీఎల్ కెరీర్ అంతా ముంబైతోనే ఉన్నాడు. హార్దిక్ గుజరాత్ టైటాన్స్ కు ఆడినా.. ఐపీఎల్ 2024 సీజన్‌లో కెప్టెన్‌గా ముంబై ఇండియన్స్ జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. క్రికెట్‌లో రాణించాలనే తపన, ఆకలి హార్దిక్, కృనాల్ లో ఉన్నాయని.. అందుకే వారిని జట్టులోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నానని ఎంఐ యజమాని చెప్పారు.

“ఐపీఎల్ లో మనందరికీ ఒక నిర్దిష్ట బడ్జెట్ ఉంటుంది. ప్రతి జట్టుకు కొంత మొత్తంలో డబ్బు ఖర్చు చేయవచ్చు. దీంతో ప్రతిభ గల ఆటగాళ్లను వెతకాలని నిర్ణయించుకున్నాం. నా స్కౌట్స్, నేను ప్రతి రంజీ ట్రోఫీ మ్యాచ్ కు వెళ్ళాను. ఒక రోజు మా స్కౌట్స్ ఇద్దరు సన్నగా ఉన్న ఆటగాళ్ల దగ్గరకు తీసుకెళ్లారు. నేను వారితో మాట్లాడుతున్నప్పుడు వారు మూడు సంవత్సరాలుగా డబ్బు లేకపోవడంతో మ్యాగీ నూడుల్స్ తప్ప మరేమీ తినలేదని చెప్పారు. వారిద్దరే హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యా. 2015 లో నేను హార్దిక్ పాండ్యాను వేలంలో 10 వేల యూఎస్ డాలర్లకు కొనుగోలు చేశాను. అతడు నేడు ముంబై ఇండియన్స్ గర్వించదగిన కెప్టెన్” అని నీతా అంబానీ అన్నారు.

**‘బుమ్రా బంతితో మాట్లాడగలడు’**

బుమ్రా గురించి స్కౌట్స్ తనకు ఎలా చెప్పారో నీతా అంబానీ వెల్లడించారు. మా స్కౌట్స్ విచిత్రమైన బౌలింగ్ యాక్షన్ ను కలిగిన క్రికెటర్ ను నాకు పరిచయం చేశారు. దీంతో అతన్ని ముంబై జట్టులోకి తీసుకున్నాం. ఆ తర్వాత బుమ్రా క్రికెట్ లో చరిత్ర సృష్టించాడు. గత సంవత్సరం మేము తిలక్ వర్మను తీసుకున్నాం. అతడు ఇప్పుడు టీమ్ ఇండియాలో వన్ ఆఫ్ ది బెస్ట్ ప్లేయర్. ముంబై ఇండియన్స్‌ను ఇండియా క్రికెట్ నర్సరీ అని పిలవడం అని పిలవొచ్చు”. అని నీతా అంబానీ అన్నారు. 2025 ఐపీఎల్ సీజన్ విషయానికి వస్తే తొలి మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ తో ఆడనున్నారు.

# సమంత మ్యాజికల్ లుక్.. స్టైలిష్ గౌనులో కిర్రాక్ స్టిల్స్

గాబ్రియెల్లా డిమెట్రియాడ్స్: తెలుపు రంగులో అద్భుతమైనది!





ఎల్లి అవ్రామ్ యొక్క పూజ్యమైన లావెండర్ దుస్తుల ఫోటోలు



సినీ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సమంత రూత్ ప్రభు, తన అందం, అభినయం, స్టైల్‌తో ఎప్పటికప్పుడు ట్రెండింగ్‌లో నిలుస్తూనే ఉంటారు. సినిమాల్లో నటనలో తనదైన మార్క్ చూపించిన సమంత, ఫ్యాషన్ ప్రపంచంలో కూడా ఒక స్టైల్ ఐకాన్‌గా మారిపోయారు. ఇటీవల ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోషూట్ స్టిల్స్ మరోసారి అభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.వైట్ అండ్ బ్లూ కలర్ డ్రెస్‌లో ఆమె స్టన్నింగ్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఫోటోల్లో సమంత ఒక వైట్ స్లీవ్‌లెస్ టాప్, బ్లూ షేడ్స్‌తో మిక్స్ అయిన ఫ్లోయింగ్ స్కర్ట్‌లో కనిపిస్తోంది. ఆమె స్టైల్‌ను మరింత హైలైట్ చేస్తూ ఉన్న ఈ డ్రెస్, సింప్లిసిటీకి, క్లాసీ లుక్‌కి ఒక మంచి ఉదాహరణ. హై ఫ్యాషన్ అవుట్‌ఫిట్‌లో కూడా సమంత తన నేచురల్ బ్యూటీని కాపాడుకోవడం విశేషం.మెసీ హెయిర్, మృదువైన మేకప్, సోఫ్ట్ టోన్ లిప్ కలర్ ఆమె లుక్‌కు మరింత అందం తెచ్చాయి. ఈ ఫోటోషూట్‌లో సమంత ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్‌కు ప్రత్యేక ఆకర్షణ ఉంది. స్టిల్‌లో కనిపించే ఆమె నడక, గౌనులో ఉండే స్వభావిక మోషన్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. ఆమె క్యాప్షన్‌లో సెలీనా గోమెజ్ సాంగ్ లిరిక్స్‌ను జత చేయడం అభిమానుల్లో మరో ఆసక్తికరమైన చర్చకు దారి తీసింది. ఫ్యాన్స్ ఈ ఫోటోలను చూసి “క్లాసీ అండ్ ఎలిగెంట్” అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కొంతమంది ఆమె గ్లామర్ వేరే లెవల్‌కి వెళ్లిపోయిందని అంటుంటే, మరికొందరు సమంత ఎప్పుడూ ట్రెండ్స్‌ను ముందే ఫాలో అవుతుందని ప్రశంసిస్తున్నారు.ప్రస్తుతం సమంత తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే దిశగా ప్రయాణం కొనసాగిస్తూనే, కొన్ని ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్స్‌ను అంగీకరించినట్లు టాక్. మరోవైపు, ఓ వెబ్ సిరీస్‌తో బిజీగా ఉన్నారు. టాలీవుడ్‌లోనూ ఆమె తిరిగి సినిమాల్లో కనిపించే అవకాశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. కానీ ఎలాంటి సినిమా ఎనౌన్స్ మెంట్స్ లేకున్నా, సమంత తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌తో మాత్రం ట్రెండింగ్‌లోనే కొనసాగుతోంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com